

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 12 సంచిక : 6 ఫిబ్రవరి 2007

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 05-01-2006, పాలకొల్లు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

జపధ్యానములు చేయటం, ఆధ్యాత్మికవిషయాలు శ్రవణం చేయటం ఇవన్నీ మరణానంతర జీవితంలో ఉపయోగపడతాయి, ఇప్పుడు ఏమీ ఉపయోగపడవు అని మీరు అనుకొంటే మీరు సబ్జక్టు సరిగా అర్థం చేసుకోవటం లేదు. అక్కడ ఉన్నదే ఇక్కడ ఉంది, ఇక్కడ ఉన్నదే అక్కడ ఉంది. ద్రవ్యయజ్ఞం, తపోయజ్ఞం, జపయజ్ఞం, జ్ఞానయజ్ఞం ఇవి అన్నీ యజ్ఞాలు. మనం దేహాభిమానం లేకుండా, స్వార్థం లేకుండా ఏ పని చేసినా అది యజ్ఞంతో సమానము. ఈ సృష్టిరూపంలో ఉన్న వాడు, సమాజరూపంలో ఉన్నవాడు భగవంతుడే. భౌతికానికి, ఆధ్యాత్మికానికి తేడా ఉందని మనం అనుకొంటే మన అండర్‌స్టాండింగ్ ప్రోపర్‌గా లేదు. రెండూ ఒక్కటే కాని మనకి సరైన అవగాహన లేకపోవటం వలన అది వేరు, ఇది వేరు అనుకొంటున్నాము. మనం ఏదో దేవుని రూపాన్ని ఆరాధిస్తూ ఉంటాము. మనం ఏదైనా సంస్థకు సహాయ సహకారములు అందించవచ్చు. దేవుని ఆరాధించటం పూజ అనుకొంటాము, సంస్థకు సహాయం చేయటం భౌతికవిషయం అనుకొంటాము కాని అదీ పూజే, ఇదీ పూజే. ఈ సృష్టిలో అన్ని పదార్థాలలో, జీవకోటి అంతటా భగవంతుడు ఉన్నాడు. మీ ఇంట్లో ఎవరైనా ముసలివారు ఉంటే వారిని ప్రేమగా చూడాలి. ఎందుచేతనంటే మీరు చిన్నప్పుడు వారు మిమ్మల్ని బాగా చూసారు కాబట్టి వారు ముసలివారు అయ్యాక వారిని మీరు బాగా చూస్తే ఆ ఋణం తీరిపోతుంది. మనం సమాజం నుండి కొన్ని పాఠాలు నేర్చుకొంటున్నాము కాబట్టి సమాజఋణం తీర్చాలి. మనకు సామాజికస్పృహ ఉండాలి. పెద్ద

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥150/-

విడి ప్రతి : రూ॥ 10/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551

ఈ సంచికలో....

పాలకొల్లు .......... 05-01-06

పిప్పర ................ 09-04-06

భీమవరం .......... 12-04-06

పాతాళమెరక .... 28-11-06

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

పెద్ద మేధావులు, పండితులు అయిన వారికి కూడా సామాజికస్పృహ ఉండదు, తెలివితేటలు ఒక్కటే సరిపోదు, సామాజికస్పృహ అవసరం.

భగవంతుడు మనలో అంతర్యామిగా ఉన్నాడు. మనకు వచ్చే తలంపులు, ఆలోచనలు, మనం చేసే పనులు, మనం మాట్లాడే మాటలు అన్నింటికి భగవంతుడు సంతోషించాలి. సమాజం మెచ్చుకోవటం కాదు, భగవంతుడు మెచ్చుకొనేలా మనం జీవించాలి. అత్తరు కావాలంటే రాసుకోండి అంతేగాని అత్తరు లోపలికి తాగకండి అని ఆంగ్లకవి చెప్పాడు. అంటే కొంతమంది గౌరవం వస్తుంది అంటే మంచిపని చేస్తారు కాని గౌరవం రాకపోతే అది మంచిపని అయినా చేయరు. మనం అలా జీవించకూడదు. అది మంచిపని అనుకొన్నప్పడు మనకు గౌరవం రాకపోయినా ఆపని చేయాలి. ఫలితం కోసం చూడవద్దు. కర్మఫలదాత ఈశ్వరుడు. మనకు ఉన్న ధనం, పాండిత్యం, కీర్తి ఇవి అన్నీ అత్తరు లాంటివి. మీకు ఉన్న ధనం పైకి బాగానే ఉంటుంది, దానితో మీరు మంచిపనులు చేయవచ్చు, కొంత ఎంజాయ్ చేయవచ్చు అంతవరకే. కాని నేను ధనవంతుడిని, నేను ధనవంతుడిని అనే భావన లోపలకు వెళితే మీ బ్రెయిన్ పాయిజన్ అయిపోతుంది, చివరకు కుళ్ళిపోతారు. అత్తరు బట్టలకు రాసుకొంటే ఫరవాలేదు, సువాసన వస్తుంది, అంతేగాని లోపలకు తాగితే అంతా పాయిజన్ అయిపోతుంది. అందుచేత ధనం, కీర్తి, పాండిత్యం ఇవి అన్నీ బయట ఉండేవేగాని వాటిని లోపలకు తీసుకోవద్దు, లోపలకు తీసుకొంటే మీ బుద్ధి పాడైపోతుంది. బయట ఊరేగింపులు బాగానే ఉంటాయి కాని లోపల కుళ్ళిపోతారు అంటే శరీరం మరణించిన తరువాత ప్రయాణించే జీవుడు కుళ్ళిపోతాడు. జీవుడిలో ఉన్న అహంభావన తగ్గటానికీ, దేహభావన తగ్గటానికీ ఈ ప్రవచనాలు. అహంభావన లేకుండా మనిషి ఉండడు. ఒకడికి ఎక్కువ ఉండవచ్చు, ఒకడికి తక్కువ ఉండవచ్చు. అహంభావన వేరుతో సహా పోతే వాడు దేవుడు అయిపోతాడు. దేవుడిని ఎలా పూజిస్తామో అప్పడు ఆ మనిషిని కూడా అలా పూజిస్తారు. వాడినే మనం జీవన్ముక్తుడు అని, మహాత్ముడు అని అంటాము.

కొంతమందికి ఇంటి నిండా బంగారం ఉంటుంది, మనస్సు నిండా దారిద్ర్యం ఉంటుంది. ఇంటిలో ఉన్న సంపదలను బట్టిగాని, నా చుట్టూ తిరుగుతున్న మనుషులను బట్టి గాని నాకు మోక్షం రాదు, హృదయంలో ఉన్న సంపదను బట్టి మోక్షం వస్తుంది. సహృదయం ఉన్నవారితో, సద్బుద్ధి ఉన్నవారితో సహవాసం చేస్తూఉంటే వారి వైబ్రేషన్స్ మన మీద పనిచేస్తాయి, అందుకే సత్సంగం. సత్సంగం వలెనే సమ్యక్ వ్యాయామం అవసరం. సమ్యక్ వ్యాయామం అంటే గతించిన గొడవలు మర్చిపోవాలి. కొంతమంది జరిగిపోయిన

గొడవలు తలపెట్టుకొని ఏడుస్తూ ఉంటారు. అది సరియైన జీవితం కాదు. చేలో ఉన్న నీరు బయటకు పోయింది అనుకో మనకు చేతనైతే కొత్త నీరు పెట్టుకోవాలి కాని వెళ్ళిపోయిన నీరు గురించి ఏడవటం ఎందుకు? కొంతమంది భవిష్యత్ గురించి గాలిలో మేడలు కడతారు, అది కూడా అనవసరం, వర్తమానకాలాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకో. వర్తమాన కాలాన్ని ప్రోపర్‌గా ఉపయోగించుకొంటే లోచూపు కలుగుతుంది.

నీ హృదయంలో ఉన్న నిజం సమానంగా ఉంది. నీకు పాండిత్యం ఉండవచ్చు, పాండిత్యం లేకపోవచ్చు, ధనం ఉండవచ్చు, ధనం లేకపోవచ్చు, అధికారం ఉండవచ్చు, అధికారం లేకపోవచ్చు. భక్తుడు ఏమి చేస్తాడు అంటే నీ ధనాన్ని చూడడు, నీ పాండిత్యాన్ని చూడడు, నీ శరీరాన్ని చూడడు, నీ మనస్సును చూడడు, నీ కీర్తిని చూడడు. నీ హృదయంలో ఉన్న నిజాన్ని చూడటం నేర్చుకొంటాడు, వాడే భక్తుడు. ఒక్క రూపాయి పెట్టుబడి లేకుండా, మనకు ఏమీ శ్రమ లేకుండా మంచివారం అయ్యే ఉపాయం పెద్దలు చెపుతున్నారు. ప్రతీ మనిషిలోనూ ఏదో మంచితనం ఉంటుంది. ఏమీ మంచితనం లేకుండా మనిషి ఉండడు. వాడిలో ఉన్న మంచిని మనం చూడటం నేర్చుకొంటే మనకు ఏమీ శ్రమ లేకుండా, పెట్టుబడి లేకుండా, సాధన పేరు మీద ఏమీ బాధ లేకుండా మనం మంచివారము అయిపోతాము. అంటే ఎవడిలో ఏ మంచితనం ఉన్నా అది మనం నేర్చుకొంటే మనకు మంచితనం వచ్చేస్తుంది. మనం బాహ్యంగా ఏవో కొన్ని మంచిపనులు చేసినంత మాత్రంచేత లోచూపురాదు. సబ్జెక్టును బాగా శ్రవణం చేయాలి, విన్న దానిని మననం చేయాలి, మనం డౌట్ ఫ్రీ అయ్యాక, మనకు సరియైన అవగాహన వచ్చాక మనం విన్న వాక్యాన్ని ధ్యానం చెయ్యాలి. అహంభావ రహితంగా చెప్పిన ప్రతీమాట కూడా దేవుడై ఉన్నది, మనం దేవుడి యొక్క రూపాన్ని ఎలా ధ్యానం చేస్తున్నామో ఆ వాక్యాన్ని కూడా అలా ధ్యానం చెయ్యాలి. ఒక మనిషి ఎప్పుడైనా తెలివి తక్కువ పని చేసాడు అనుకోండి, అందులో నుండి పాఠాలు నేర్చుకొని ఆ పని తిరిగి చేయకుండా ఉంటే వాడు తెలివైనవాడు. కొంతమంది చేసే పనులు వారికి ఉపయోగపడవు, సమాజానికి ఉపయోగపడవు, దీని వలన జీవితం వృధా అయిపోతుంది, మనకు మరల ఇటువంటి అవకాశాలు వస్తాయని చెప్పలేము.

నీకు ఇంటిలో ఎన్ని పదార్థాలు ఉన్నా ఆకలి లేకపోతే వాటిని తినలేవు అలాగే నీకు జిజ్ఞాస లేకపోతే జ్ఞానం సంపాదించలేవు, లోపల నుండి అది కెరటం కింద రావాలి. నీవు బుద్ధిని దగ్గరపెట్టుకొని సబ్జెక్టును శ్రద్ధగా శ్రవణం చేయటం వలన నీకు జిజ్ఞాస కలుగుతుంది. మనం సక్సెస్ అవ్వటమే కాదు ఫెయిల్ అవ్వటం కూడా నేర్చుకోవాలి. మనం వ్యాపారం

చేస్తాము. ఒకోసారి లాభం వస్తుంది, ఒకోసారి నష్టం వస్తుంది. ఆ నష్టాన్ని కూడా మనం స్వీకరించాలి. అలా స్వీకరించే శక్తి మనకు లేనప్పడు శరీరంలో, మనస్సులో మార్పులు వస్తాయి. శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం చెడిపోతుంది. నీవు లేనిపోనివి ఊహించు కోవద్దు. ఏ రోజున ఏది వస్తే అది నీకు ఉపయోగపడుతుంది అంటే దానిని స్వీకరించు లేకపోతే దానిని రిజక్టు చెయ్యి. ఇందులో ఏమీ రాజీ పడవద్దు. నీ వివేకాన్ని విడిచిపెట్టవద్దు. నీకు నువ్వు శత్రువుగా ఉండవద్దు, నీకు నువ్వు మిత్రుడిగా ఉండు అని భగవంతుడు చెప్పాడు. అంటే నీ మనస్సు నీ స్వాధీనంలో ఉంది అనుకో నీ మిత్రుడు నీకు ఎంత సహాయం చేస్తాడో అంతకంటే ఎక్కువ సహాయం నీ మనస్సు చేస్తుంది. నీ మనస్సు నీకు శత్రువుగా ఉంది అనుకో, నీ మాట వినటం లేదు అనుకో నీ శత్రువు చేసే అపకారం కంటే ఎక్కువ అపకారం నీ మనస్సు చేస్తుంది. శారీరక ఆరోగ్యం కోసం మీరు ఎలా వ్యాయామం చేస్తున్నారో అలాగ మనస్సుకు కూడా సమ్యక్ వ్యాయామం ఉండాలి. అంటే మీకు అవసరం లేని తలంపులు వచ్చినప్పడు, ఉపయోగంలేని ఆలోచనలు వచ్చినప్పడు వాటిని రిజక్టు చెయ్యాలి, దాని తాలుక వ్యాయామం మనస్సుకు ఉండాలి. ఏది ఎప్పడు ఎలా జరగాలో అలా ప్రకృతి చేసుకొంటూ పోతుంది. శరీరం పుట్టినది మొదలు మరణించే వరకు ఎవడి జీవితం సమానంగా వెళ్ళదు, హెచ్చు తగ్గులు వస్తూ ఉంటాయి, సుఖదుఃఖాలు వస్తూ ఉంటాయి. వాటితో తాదాత్మ్యం పొందవద్దు. నీ శరీరం ఎంత నిజమో, నీ మనస్సు ఎంత నిజమో, నీకు వచ్చే సుఖదుఃఖాలు కూడా అంతే నిజం. అందుచేత వాటితో తాదాత్మ్యం పొందవద్దు. వాటితో తాదాత్మ్యం పొందితే పతనమైపోతావు. మీకు ఏదైనా సంతోషం వచ్చినా, దుఃఖం వచ్చినా అది భగవంతుడికి తెలియకుండా రావటం లేదు. మనం ట్రైనింగ్ పొందటానికి ఇవన్నీ భగవంతుడు పంపిస్తున్నాడు, ఇది అర్థం చేసుకొన్నవారు ధన్యులు.

మహాత్మాగాంధీ ఒక మాట చెప్పారు. మీరు అందరూ నన్ను మహాత్ముడు అంటున్నారు. మీరు కాదు కదా నాకు జ్ఞానం ఇచ్చేది. నేను ఎరుకలో ఉండగా ఎవడైనా వచ్చి నన్ను డైరెక్టుగా చంపేస్తే వాడి మీద కూడా నాకు కోపంగాని, ద్వేషంగాని రాకుండా ఉంటే అప్పడు నేను మహాత్ముడినే, అంతేకాని మీరు అనుకోవటం వలన నేను మహాత్ముడిని కాదు అని చెప్పారు. కొంతమంది లోకంతో అతిగా ఉండరు, ఎంతవరకు ఉండాలో అంతవరకు ఉంటూ, వారి పనులు ఏవో వారు చేసుకొంటూ, ఎక్కువ జపధ్యానములు చేసుకొంటూ ఉంటారు, సాధ్యమైనంతవరకు ఇతరుల గొడవలలోనికి వెళ్ళరు. జపధ్యానములు చేయటం వలన ఏకాగ్రత పెరుగుతుంది, హృదయం యొక్క లోతులు పెరుగుతాయి, మనం చేతిలో

ఉన్న పనిని పెర్‌ఫెక్టుగా చేయగలుగుతాము. అవకాశం ఉంటే రోజూ ఒక గంటసేపు మౌనంగా ఉండటం మంచిది, మౌనంగా ఉన్నప్పుడు లోపల ఏమి జరుగుతోందో మనకు తెలుస్తుంది. కొంతమంది రాత్రనక, పగలనక కష్టపడి స్వార్థాన్ని సంపాదించుకొంటున్నారు, అజ్ఞానాన్ని సంపాదించుకొంటున్నారు, అది వారికి తెలియటం లేదు. స్వార్థం లేనివాడు ఋషి అవుతాడు. మనం స్వార్థాన్ని తగ్గించుకోవటానికి ప్రయత్నము చేయటం లేదు, కష్టపడి స్వార్థాన్ని, బంధాన్ని సంపాదించుకొంటున్నాము, జరిగేది ఇది. ఒక ఇటలీ క్రిష్టియన్ ఈ మధ్య ఒక మాట చెప్పాడు. అతడు క్రిష్టియన్ సంస్థలకు సంవత్సరానికి పదికోట్లు ఇస్తున్నాడు. ఆయన ఏమి చెప్పాడు అంటే నేను చెప్పలు వ్యాపారం చేసుకొంటున్నాను, ఏదో కలిసివస్తోంది, ఇస్తున్నాను. నేను తయారు చేసే చెప్పలను మనుషులు కొనుక్కోవటం వలన నాకు లాభం వస్తోంది. అందుచేత వారికే మరల పది రూపాయలు ఖర్చు పెడుతున్నాను. ఏ సమాజం వలన నేను బాగు పడ్డానో ఆ సమాజానికే కొంత డబ్బు ఖర్చు పెడుతున్నాను. ఎనాలసిస్ చేసి చూస్తే ఇందులో నా ప్రత్యేకత ఏమీ లేదు, గొప్పతనం ఏమీ లేదు. నేను తయారు చేసిన జోళ్లను ఎవరూ కొనరు అనుకోండి, నాకు లాభం రాదు అనుకోండి, ఇచ్చే శక్తి కూడా నాకు ఉండదు కదా అంటున్నాడు.

మనం అజ్ఞానాన్ని పెంచుకొంటూ జ్ఞానం పెంచుకొంటున్నాము అని అనుకోకూడదు, స్వార్థాన్ని పెంచుకొంటూ నిస్వార్థంగా ఉన్నామని అనుకోకూడదు, ఇది చాలా ప్రమాదం, మన పట్ల మనకు సరైన అవగాహన ఉండాలి. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నువ్వు శరీరయాత్రకు సరిపడ తిను, బట్టలు కట్టుకో కాని ఒకటి గుర్తుపెట్టుకో నువ్వు జీవించు ఇదంతా కల అనుకొని జీవించు, అప్పుడు నీకు టెన్షన్ రాదు అంటున్నారు భగవాన్. ఇంచుమించుగా అందిరికీ ఏదో రకమైన దుఃఖం ఉండవచ్చు. అందరూ ఏమనుకొంటున్నారు అంటే మాకు ఫలానా కారణం వలన దుఃఖం వస్తోంది అనుకొంటున్నారు. బయట కనిపించే కారణాలు అసత్యం. దుఃఖ కారణం బయట లేదు, మనలోపలే ఉంది. బయట ఉన్న వస్తువులతో, వ్యక్తులతో నీకు ఉన్న అనుసంధానం వలన దుఃఖం వస్తోంది. ప్రపంచంతో అసలు నిన్ను ఎవడు అనుసంధానం పెట్టుకోమన్నాడు. నువ్వు చెయ్యవలసిన డ్యూటీ చేసి వదిలెయ్యి. మనం కానిదానితో మనం తాదాత్మ్యం పొందుతూ ఉంటే ఏదో రోజున దుఃఖం తప్పదు. మనం ఎలా ఉండాలి అంటే ఇక్కడ కోటి రూపాయలు ఖర్చుపెట్టి ఈ బిల్డింగు కట్టారు, దీనికోసం ఈ కమిటీ వారు చాలా కష్టపడ్డారు, చేయవలసిన పని అయిపోయింది. రేపు సముద్రం పొంగివచ్చి ఈ బిల్డింగు కొట్టుకొనిపోయింది అనుకోండి,

మనకు ఎర్రచీమ కుట్టినట్లు కూడా ఉండకూడదు. మన డ్యూటీ మనం చేసాము, సముద్రం వచ్చి కొట్టుకొని పోయింది, మనం ఏమి చేస్తాము. ఆ బిల్డింగుతో నీకు ఎటాచ్‌మెంట్ లేదు అనుకో అది కొట్టుకొనిపోయినా నీకు ఏమీ అనిపించదు. దానితో ఎటాచ్‌మెంట్ పెట్టుకొన్నావా అక్కడ నుండి దుఃఖం ప్రారంభమవుతుంది. దుఃఖ కారణం అసలు బయట లేదు, బయట ఉందని నీవు అనుకొంటున్నావు, అదే నీ అజ్ఞానానికి గుర్తు. పని చేయటం వలన నీకు దుఃఖం రాదు, నేను కర్తను అని అనుకోవటం వలన దుఃఖం వస్తుంది.

కొంతమంది ఏదో విషయం గురించి ఇతరులను ఎక్కువగా ఆక్షేపిస్తూ ఉంటారు, ఇలా ఇతరులను ఆక్షేపించిన ఆ మాటలు అన్నీ వారికే తిరిగి వస్తాయి. జీవుడిలో ఉన్న వ్యక్తి భావనను నశింపచేయటమే భక్తి యొక్క గమ్యం. పెద్ద పెద్ద సాధనలు చేయలేకపోయిన గురువు పట్ల భక్తి ఉన్నా అహంభావన నశిస్తుంది అని పెద్దలు చెపుతారు. గురువు పట్ల నీకు ఉన్న భక్తి నిజమైతే నీ సాధనలతో సంబంధం లేకుండా వేరుభావన నశిస్తుంది. కొంతమంది వూరికే మైండ్ డైవర్షన్ కోసం భక్తిని పెట్టుకొంటారు. సినిమాలు ఎలా చూస్తారో, టివిలు ఎలా చూస్తారో అలాగ కొంతమంది ఇది మంచి సంస్కారం అని భక్తిని పెట్టుకొంటారు కాని భగవదనుభవం పొందటానికి సీరియస్‌గా ప్రయత్నం చెయ్యరు. మీ శరీరానికి అనారోగ్యం వచ్చింది అనుకోండి దానిని తగ్గించుకోవటానికి చాలా ప్రయత్నాలు చేస్తారు కాని భగవంతుడిని తెలుసుకోవటానికి మీరు ఏమి చేస్తున్నారో చెప్పండి. ఈ దేహానికి, మనస్సుకు, చావు పుట్టుకలకు అతీతంగా నీ హృదయంలో ఒక సత్యం ఉంది. ఇప్పుడు నేను నేను అంటే నీ దేహం నీకు ఎలా స్ఫురిస్తుందో, నీ వికారాలు ఎలా స్ఫురిస్తున్నాయో అలాగ నీ హృదయంలో ఉన్న సత్యం నీకు నేనుగా స్ఫురించే వరకూ నీకు బంధం తప్పదు, అశాంతి తప్పదు, దుఃఖం తప్పదు. అందుచేత నీ హృదయంలో ఉన్న సత్యాన్ని నీవు ఎరుకలోనికి తెచ్చుకోవాలి. అదే నీ జీవిత గమ్యం. ఆ జీవిత గమ్యాన్ని దృష్టిలో పెట్టుకొని నీ జీవితాన్ని మలుపు తిప్పకో. నీవు ఏ పని చేస్తున్నా, ఎక్కడ ఎప్పుడు ఏ నిర్ణయాన్ని తీసుకొన్నా నీ గమ్యాన్ని దృష్టిలో పెట్టుకో, గమ్యాన్ని మర్చిపోవద్దు.

మన ఇంట్లో మనుషులు కూడా స్వప్న సమానమే, మన శరీరం చనిపోయాక వారితో సంబంధం ఉండదు, ఈశ్వరుడు తప్పించి మిగతా అందరితో సంబంధం తెగిపోతుంది. ఎవడి దయ వలన నీకు మోక్షం వస్తుందో వాడు నిన్ను విడిచిపెట్టడు, మరణానంతరం కూడా వాడు నీతోనే ఉంటాడు. ఎప్పుడూ నీ కూడా ఉండేవాడిని మర్చిపోతున్నావు. తాత్కాలికంగా వచ్చి, వెళ్ళిపోయేవారి గురించి నీ జీవితాన్ని వేస్టు చేసుకొంటున్నావు. మీ

ఇంట్లో మిమ్మల్ని ఉండవద్దు అని భగవంతుడు చెప్పటం లేదు, రైల్వే స్టేషన్ మాష్టారులాగ జీవించు, నీ ఇంట్లో నువ్వు ట్రస్టీగా ఉండు అంతే. స్టేషన్‌లో ఒక రోజు డబ్బు ఎక్కువగా వచ్చినా, ఒక రోజు తక్కువ వచ్చినా మాష్టారుకు ఏమీ వికారం ఉండదు, ఎందుచేతనంటే అది తనది కాదు అని ఆయనకు తెలుసు. కుటుంబంలో నీవు కూడా అలా జీవించు, నీ పని ఏదో చెయ్యి, బంధం పెట్టుకోవద్దు, అప్పడు హాయిగా ప్రశాంతంగా ఉంటావు. ఆ జీవిత విధానం నీవు ప్రాక్టీసు చేస్తే ఎప్పడో మరణానంతరం వైకుంఠానికి వెళ్ళటం కాదు, ఇప్పడే వైకుంఠం వచ్చి నిన్ను వరిస్తుంది. నీ దేహ ప్రారబ్దాన్ని బట్టి నీ పని ఏదో నీవు చేసుకో. నువ్వు వ్యాపారం చేస్తున్నా, ఉద్యోగం చేస్తున్నా, వ్యవసాయం చేస్తున్నా, రాజకీయ నాయకుడిగా ఉన్నా, నీవు బయట ఏపని చేస్తున్నాకాని లోపల సత్యాన్వేషణ విడిచిపెట్టవద్దు. నీ హృదయంలో ఉన్న సత్యం నీకు అనుభవంలోనికి వచ్చే వరకు అసత్యం నిన్ను విడిచిపెట్టదు, బంధం నిన్ను విడిచిపెట్టదు, దుఃఖం నిన్ను విడిచిపెట్టదు. అందుచేత గమ్యాన్ని మర్చిపోవద్దు.

మిమ్మల్ని మీరు పొగడుకోవటం, ఇతరులను నిందించటం ఇవి రెండూ విడిచిపెట్టాలి, వీటిలో నుండి జీవుడు బయటకు రాకపోతే వాడికి మోక్షానికి వెళ్ళే దారి కూడా కనబడదు. ఈ స్తోత్రాల గొడవ, నిందల గొడవలోనికి వెళ్ళకండి, ఆనందంగా ఉండండి. ఎవరైనా మిమ్మల్ని స్తోత్రం చేసినా మీకు కలిసివచ్చేది ఏమీ లేదు, ఎవరైనా నిందించినా మీకు వచ్చిన నష్టం లేదు. మీ రూపం కంటే, మీకు ఉన్న ఆస్థి కంటే, మీకు ఉన్న గౌరవం కంటే, మీకు ఉన్న అధికారం కంటే, మీ కళ్ళచేత చూడబడే వస్తువులకంటే శాంతి గొప్పది. ఎందుచేతనంటే శాంతి లేదు అనుకోండి, ఇవన్నీ ఉన్నా కూడా ఒకటి లేని సున్నలతో సమానము. శాంతి లేనప్పడు ఇవి అన్నీ ఉన్నా కూడా మీరు సుఖపడరు, అది గుర్తుపెట్టుకోండి. మీ ఇంట్లో అశాంతికి కారణాలు ఉన్నాయి అనుకోండి, సమాజంలో కూడా అశాంతికి కారణాలు ఉన్నాయి అనుకోండి అయినా మీరు శాంతిగా ఉండగలుగుతున్నారు అనుకోండి ఈశ్వరుడు తన స్వరూపాన్ని మీకు ఇస్తాడు, ఇంక మీకు జపధ్యానములతో పనిలేదు, మీ బెర్త్ రిజర్వు అయిపోతుంది. ఈ మాటలు చెప్పటం చాలా తేలిక కాని అలా ఉండటం చాలా కష్టం. ఒక్క జ్ఞాని మాత్రమే అందరిలోను నన్ను చూస్తాడు అని పరమాత్మ గీతలో చెప్పాడు. జ్ఞాని ఇతరుల రూపాలను, నామాలను చూడడు, వారిలో ఉన్న మైనస్ పాయింట్స్, ప్లస్ పాయింట్స్ చూడడు, వారి మనస్సును చూడడు, వారి మీద జడ్జిమెంట్స్ చెప్పడు. జ్ఞాని ఏమి చేస్తాడు అంటే మీ మనస్సుకు, మీ రూపానికి, మీ నామానికి ఆధారంగా ఉన్న చైతన్యమును చూస్తూ ఉంటాడు, అందుచేత వాడు నిర్వికారంగా ఉంటాడు. నువ్వు లోకాన్ని భయపెట్టకు, లోకాన్ని

చూసి భయపడకు. రెండూ అనర్థమే, దాని వలన నీకు లోచూపు రాదు. అందుచేత రెండింటిని విడిచిపెట్టేయి. అంటే నీకు ఏది మంచిదో కాదో అది విడిచిపెట్టేయి. షేక్స్పియర్ ఒక మాట చెప్పాడు. కొంతమంది పుట్టుకతోనే మహాత్ములుగా పుడతారు, కొంతమంది ఏవో మంచి పనులు, పుణ్యకార్యాలు చేసి మహాత్ములు అనిపించుకొంటారు. కొంతమంది పుట్టుకతో మహాత్ములుగా పుట్టరు, ఒక్క సత్కర్మ కూడా చేయరు, మమ్మల్ని మహాత్ముల కింద గుర్తించమని లోకాన్ని పీడిస్తూ ఉంటారు. ఈ మూడవ రకం జనంతో ప్రపంచం నిండి ఉంది అని చెప్పాడు. దేవుడు ఉన్నాడో లేడో నాకు తెలియదు కాని మనిషిలో ఉన్న మూర్ఖత్వం మటుకు స్పష్టంగా తెలుస్తోంది అని ఐన్‌స్టీన్ చెప్పాడు. మనిషిలో మూర్ఖత్వం ఉన్నంతకాలం అశాంతి ఉంటుంది, బయట విరోధాలు ఉంటాయి, ఈ భూమిని నరకం కింద తయారుచేసుకొంటాడు అని చెప్పటం.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 09-04-2006, పిప్పర

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

అరుణాచలంలో యోగిరామ్‌సూరత్‌కుమార్ ఆశ్రమం ఉంది. మనం బాగుపడటానికి ఒక్క రామనామం సరిపోతుంది అని ఆయన చెప్పేవారు. భక్తిలేనివారికి ప్రాణాయామం, భక్తి లేనివారికి యోగం కాని భక్తి ఉన్నవారికి రామనామం చాలు అనేవారు, ఆయన నిరంతరం రామనామం చేసేవారు. రామచంద్రప్రభువును ఆరాధిస్తే మీరు త్రిమూర్తులను ఆరాధించినట్లే. రామ శబ్దంలో రకారము, ఆకారము, మకారము ఉన్నాయి. ర అంటే రుద్రుడు, ఆ కారము బ్రహ్మదేవుడు, మ అంటే విష్ణువు. ఆయనే బ్రహ్మ, ఆయనే విష్ణువు, ఆయనే శివుడు. రామనామం లక్ష్మీప్రదమైనది. చాలా కొద్దిమంది మాత్రమే పేదవారిగా ఉండటానికి ఇష్టపడతారు. అందరికి ధనవంతులు అవ్వాలని ఉంటుంది. ధనవంతులు అంటే ఇక్కడ కూర్చున్నవారు ధనవంతులు కాదు. వారి పొట్టా, బట్టా, ఉండ టానికి నీడ వారి ఖర్చులు పోగా ఎవరికైనా పది రూపాయలు సహాయం చేస్తూ ఉంటే వారు ధనవంతులు. కోట్లాదిమంది ఆయన వెనకాల ఉన్నా గాంధీగారు బీదవాడిగా ఉండటానికి ఇష్టపడేవారు. గౌతమబుద్ధుడు మహారాజు అయినప్పటికీ బీదవాడిగా ఉండటానికి ఇష్టపడ్డాడు. గాంధీగారు, బుద్ధుడు బాహ్యంగా బీదవారు అయినా హృదయంలో వారు ధనవంతులు, అది జ్ఞాపకం పెట్టుకోండి.

రాముడు అంటే ఒక రూపం అని, దశరధుడి కుమారుడు అని అనుకొంటాము. అలా అనుకోవటంలో పొరపాటు లేదు కాని మన హృదయంలో ఉన్న బ్రహ్మమే రాముడు,

మన హృదయంలో ఉన్న చావులేని సత్యవస్తువే రాముడు, మన హృదయంలో ఉన్న ఆనందమే రాముడు. రాముడు కేవలం రావణాసుర సంహారం నిమిత్తమే రాలేదు, ఎలా జీవిస్తే మనకు ఆత్మజ్ఞానం కలుగుతుంది, ఎలా జీవిస్తే ఈ భూమిమీద ఉండగానే వైకుంఠస్థితిని పొందుతాము అనేది రాముడు జీవించి చూపించాడు. కేరళలో ఉన్న ఆనందఆశ్రమంలో ఉదయం 6 గంటలకు మొదలుపెట్టి సాయంత్రం 6 గంటల వరకు రామనామం చేస్తూనే ఉంటారు. మా మనస్సు బాగు చేయటానికి, మాకు జ్ఞానం కలగటానికి రామనామం చాలు అని వారు చెపుతారు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే మీకంటే మంచివారితో, మీకంటే వివేకవంతులతో సహవాసం చేయండి. సత్పురుషులతో సహవాసం వలన మీకు ఉత్తమ జన్మలు వస్తాయి, పుణ్యలోకాలు వస్తాయి. స్నేహాలను బట్టి భౌతికంగా కూడా బాగుపడినవారు ఉన్నారు, పాడైపోయినవారు ఉన్నారు. సజ్జనసాంగత్యం వలన భౌతికంగా కూడా కలిసివస్తుంది, మోక్షం కూడా వస్తుంది. నీటిలో చేప ఆనందంగా కేరింతలు కొడుతూ ఎలా ఈదుతూ ఉంటుందో అలాగ జ్ఞాని ఆనందసముద్రంలో, శాంతిసముద్రంలో ఈతలు కొడుతూ ఉంటాడు, అది జ్ఞాని యొక్క వైభవం. ఎప్పుడైతే వాడికి కావలసిన ఆనందం, సుఖం, శాంతి హృదయంలో దొరుకుతుందో అప్పుడు మనస్సు బాహ్యముఖానికి వెళ్ళదు. రాముడిలో 16 కళ్యాణగుణాలు వాల్మీకి చెప్పాడు. అందులో ఒక్క కళ్యాణగుణాన్ని మీరు ప్రాక్టీసు చేస్తే మిగిలిన గుణాలు అన్నీ పిలవకుండా మనకు వచ్చేస్తాయి. కళ్యాణగుణాలు ఆత్మజ్ఞానసముపార్జనకు మనకు సహకరిస్తాయి.

మీరు ఏదైనా మంచి పని చేస్తున్నా, మంచి మాట మాట్లాడుతూ ఉన్నా వాటిని చూసి రాముడు మోసపోడు. ఆయన మనలో అంతర్యామిగా ఉన్నాడు కదా, ఆపని చేసేటప్పుడు, ఆ మాట మాట్లాడేటప్పుడు మీ ఇంటెన్షన్ ఎలా ఉంది, మీ భావన ఎలా ఉంది అని ఆయన చూస్తాడు. గుహుడు రాముడిని నది దాటించినప్పుడు ఆయన దగ్గర డబ్బులు పుచ్చుకోడు. రామా నీ దగ్గర డబ్బులు పుచ్చుకోను ఎందుకంటే ఇద్దరం ఒకే జాతి వారము, నేను జీవకోటిని ఈ నది దాటిస్తున్నాను, నీవు ఏమో సంసార సముద్రాన్ని దాటిస్తున్నావు అని చెప్పాడు. అప్పుడు రాముడు ఏమన్నాడు అంటే మేము నలుగురే అన్నదమ్ములము కాని గుహా ఇప్పుడు నువ్వు అయిదో వాడివి అన్నాడు రాముడు. మనుషులు మనుషులలాగ ఉండాలి కాని కోతులులాగ ఉండకూడదు అని ఈ మధ్యన ఒక మహాత్ముడు చెప్పాడు. మీకు రెండు చేతులు ఉన్నాయి, కోతులకు రెండు చేతులు ఉన్నాయి. కోతులు చెడ్డ పనులు చేస్తాయి, అవి తినేది తక్కువ, పాడు చేసేది ఎక్కువ. మీరు కోతులులాగ వ్యవహరించకండి,

మీ చేతులను మంచి పనులకు ఉపయోగించండి. అంటే మీకు ఉన్న ఇంద్రియాలను మంచికి కనుక ఉపయోగిస్తే మీ మనస్సు దానంతట అదే అంతర్ముఖమవుతుంది, మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఎవరైనా చెడుమార్గంలో వెళుతూ ఉంటే వారికి మంచి చెప్పండి. వారు వినరు అనుకోండి, వారిని వదిలేయండి కాని వారితోపాటు మీరు కూడ పాడవ్వవద్దు అది రామాయణం చెప్పింది. రాముడితో యుద్ధానికి ముందు రావణాసురుడి సభలో యుద్ధం గురించి మాట్లాడు కొంటారు. రావణాసురుడు, ఇంద్రజిత్ కూడా రాముడు గురించి తక్కువ చేసి మాట్లాడతారు. అప్పడు విభీషణుడు చెపుతాడు, మీరు రాముడిని తక్కువ అంచనా వేస్తున్నారు. ఆయన చేతిలో చనిపోతారు అని చెప్పాడు. అయినా వారు వినలేదు. మీరు మంచి చెప్పినా వినటం లేదు అని వారిని వదిలేసి విభీషణుడు రాముడి పక్షంలోనికి వచ్చేసాడు.

స్థూలదేహం కంటే సూక్ష్మదేహానికి హిందూమతంలో ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చారు. మనకు బాహ్యమైన శుచి తక్కువే. మన ఇల్లు, బట్ట, రోడ్డు అంత శుభ్రంగా ఉంచుకోము. ఈ దేహానికి, పరిసరాలకు అంత విలువ ఇవ్వకపోయినా, వాటిని అంత శుభ్రంగా ఉంచుకో లేకపోయిన లోపల ఉన్న సూక్ష్మదేహాన్ని అంటే జీవుడిని శుభ్రంగా ఉంచుకోవటానికి, దానిని బాగుచేసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. ఎందుచేతనంటే అది మరణానంతరం నీకూడా వస్తుంది. మరణానంతరం నీకూడా వచ్చే జీవుడి విషయంలో అశ్రద్ధగా ఉండవద్దు. జాగ్రదవస్థలో నేను ఉంది, స్వప్నావస్థలో నేను ఉంది. ఇక్కడ పుణ్యం గొడవ, పాపం గొడవ, జన్మల గొడవ, దేవుని గొడవ అంతా ఉంది. మనకు గాఢనిద్రలో ఈ గొడవలు ఏమీ లేవు కాని అక్కడ కూడా ఒక నేను ఉంది. ఆ నేనును ఇప్పుడు మనం పట్టుకోవాలి, అదే మన జీవిత గమ్యం, ఇది మీరు బాగా గుర్తు పెట్టుకోండి. గాఢనిద్రలో ఉన్న నేనుకు పరిమితులు లేవు, హద్దులు లేవు. మరి జాగ్రదవస్థలో ఈ నేను వచ్చాక పరిమితులు వస్తున్నాయి. ఆత్మకు పరిమితులు లేవు, మనస్సుకు పరిమితులు ఉన్నాయి. ఈ పరిమితులలో ఉన్నంతకాలం నువ్వు ఆత్మహత్య చేసుకొన్నవాడితో సమానము. ఈ మధ్య నాకు కోపం ఎక్కువగా వస్తోంది అని ఒక లెక్చరర్‌గారు అడుగుతున్నారు. మీరు ఒక రూపంతోటి, నామంతోటి, పార్టీతోటి, కులంతోటి ఇలా ఏదో ఒక దానితో తాదాత్మ్యం పొందుతున్నారు. ఇలా తాదాత్మ్యం పొందుతున్నంతకాలం మీకు కోపం రావటం ఆగదు. మీరు బ్రాహ్మణులు అనుకోండి. ఇక్కడ నేను రాజులను తిడతాను అనుకోండి మీకు కోపం రాదు ఎందుచేత మీకు ఆ కులంతో తాదాత్మ్యం లేదు. కాని బ్రాహ్మణులను తిడతాను అనుకోండి మీకు వెంటనే కోపం వస్తుంది,

ఇక్కడ నుండి లెగిసి వెళ్ళిపోతారు. ఒక కులంతో గాని, ఒక మతంతోగాని, ఒక పార్టీతోగాని, ఒక ప్రాంతంతోగాని, ఒక రూపంతోగాని ఇలా దేనితో తాదాత్మ్యం ఉన్నా మీకు కోపాలు తగ్గవు. దేనితోను మీకు తాదాత్మ్యం లేదు అనుకోండి మీకు కోపం రాదు. ఈ కోపతాపములను తగ్గించేదే రామ నామం.

అహంభావన లేకుండా పని చేస్తే పని బాగా అయిపోతుంది, దేవుని అనుగ్రహానికి పాత్రులవుతాము. అది చేయాలి, ఇది చేయాలి అని జ్ఞాని ఏమీ అనుకోడు, ఆయనకు సంకల్పం ఏమీ ఉండదు. ఆయన శరీరం ద్వారా మహత్తర కార్యాలు జరుగుతాయి, అలా జరుగుతున్నాయి అని కూడా ఆయన అనుకోడు. అది జ్ఞాని యొక్క వైభవం. మనకు సుఖం లేదు, శాంతి లేదు. ఇతరులు మనలను పొగుడుతారు అనుకోండి, దాని వలన మనకు లాభం ఏమిటి? ఇతరుల గొడవ మనకు అనవసరం. మన కళ్ళతో మనం చూసుకొని, మనలోని బలహీనతలు తెలుసుకొని వాటిని తొలగించుకోవాలి. ఈశ్వరుడిపట్ల మీకు ఉన్న భక్తి నిజమైతే, ఆయన పట్ల మీకు ఉన్న ప్రేమ నిజమైతే ఆ ప్రేమ ప్రవాహంలో మీలోని వాసనలు, బలహీనతలు అన్నీ మీకు తెలియకుండా కొట్టుకొనిపోతాయి, అవి కాలి బూడిద అయిపోతాయి, ఆ ప్రేమ అంత బలీయ మైనది. మీరు మంచిపని చేసారు అనుకోండి. దానినే తలపెట్టుకొంటూ ఉంటే అది వాసన కింద పడుతుంది, అది అనేక జన్మలకు కారణం అవుతుంది. అందుచేత చేసి మర్చిపోవాలి. భగవంతుడి సంకల్పం లేకుండా మనం మంచిపని చేయలేము, ఏదీ చేయలేము. భగవంతుడు మనకు ఇచ్చినది తిరిగి ఆయనకే ఇచ్చి, నేను ఇచ్చాను అనుకొంటున్నాము. ఇది జీవలక్షణం.

జ్ఞానులతోటి, భక్తులతోటి, సత్పురుషులతోటి సహవాసం వలన వారిలాగ మనం కూడా జ్ఞానం సంపాదించాలి, బాగుపడాలి అనే తలంపు లోపల నుండి వస్తుంది. నీకు జ్ఞాపకశక్తి, వివేకం పెరుగుతుంది. మిమ్మల్ని బాగుపడమని ఎవరో చెప్పటం వేరు, మనం బాగుపడాలి అనే సంకల్పం లోపల నుండి రావటం వేరు. సజ్జన సాంగత్యం వలన, వారి వైబ్రేషన్స్ వలన బాగుపడాలనే తలంపు మన హృదయంలో మొలుస్తుంది. అప్పుడు నీకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొంటావు, ఈ లోకంలో సుఖపడతావు. నీవు మంచి లోకాలకు వెళ్ళటానికి సత్పురుషుల సహవాసం నీకు వంతెన కింద ఉపయోగ పడుతుంది. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే విశ్వాసం మనకు ఉండాలి. ఏదో రోజున మీ ముక్కులో గాలిపోతుంది. నీ శ్వాస పోయినా ఈశ్వరుడి పట్ల విశ్వాసం పోకుండా చూసుకోవాలి అని గాంధీగారు తరచు చెప్పేవారు. నువ్వు జ్ఞానం సంపాదిస్తే, శాంతి స్థానం

నీవు పొందితే నీవు ఇంట్లో కూర్చొన్నా నీ ప్రభావం సమాజం మీద పనిచేస్తుంది. అక్కడ సంకల్పం ఏమీ ఉండదు. ఆ ప్రెజన్స్‌లో అన్నీ జరిగిపోతూ ఉంటాయి, అది జ్ఞాని యొక్క వైభవం. నీవు తక్కువగా తిను ఎక్కువగా పని చెయ్యి, తక్కువగా ఖర్చు పెట్టు ఎక్కువగా సంపాదించు, తక్కువగా మాట్లాడు ఎక్కువగా ఆలోచించు. మీ ఆలోచన సక్రమంగా ఉంటే, మీ ఆలోచనే అమృతంగా మారిపోతుంది. శాస్త్రంలో ఒక మాట ఉంది. మంచివారిని ఇంకా మంచి వారిగా చెయ్యటానికి చెడ్డవారిని భగవంతుడు ఉపయోగించుకొంటాడు, అందుకు ప్రపంచంలో చెడ్డవారు ఉంటారు. రావణాసురుడు లేకపోతే రాముడి గొప్పతనం తెలియదు, దుర్యోధనుడు లేకపోతే పాండవుల గొప్పతనం తెలియదు.

చెరువు దగ్గరకు వెళ్ళి రాయి వేస్తే లోపల ఉన్న బురద బయటకు వస్తుంది, లోపల బురద లేదు అనుకోండి మీరు రాయి వేసినా రాదు. మీలో బలహీనతలు ఉన్నాయి అనుకోండి. వాటిని మీకు తెలియజేయటం కోసం లోపల కెలుకుతాడు, ఎవడో ఒకడి నోరును ఉపయోగించుకొంటాడు. నీలో ఉన్న బలహీనతలను బయటకు లాగి నీకు తెలియజేస్తాడు. ఆ బలహీనతలను నీకు తెలియజేసేవాడు గురువు, వాటిని తొలగించు కోవటానికి శక్తిని ఇచ్చేవాడు గురువు, వాటిని తొలగించేవాడు గురువు, నీకు మోక్షం ఇచ్చేవాడు గురువు, అంతా గురువే. తులసీదాసుగారికి భార్య అంటే చాలా ఇష్టం. ఏదో ఒక సందర్భంలో తులసీదాసుగారి భార్య తులసీదాసుతో ఏమంది అంటే నీకు నా మీద ఉన్న ఇష్టం, నీకు నా మీద ఉన్న ప్రీతి రాముడి మీద ఉంటే ఏనాడో బాగుపడిపోదురు అని అంది. తులసీదాసుగారి భార్య చేత ఈ మాటలు అనిపించింది ఎవరు? రాముడే అనిపించాడు, ఆయనను రామభక్తుడిగా చేసుకొన్నాడు, తులసీ రామాయణం వ్రాయించాడు. అక్కడ మాటలు అన్నవాడు రాముడు, రామాయణం వ్రాసిన వాడు రాముడు, తులసీదాసుకు మోక్షం ఇచ్చినవాడు రాముడు, అంతా రాముడే. గురువు అనుగ్రహం లేకుండా మన పాడుబుద్ధిలో నుండి మనం బయటకు రాలేము. అంతా ఈశ్వర సంకల్పంతో నడుస్తోంది అని విన్నంత మాత్రం చేత మన దుఃఖం నశించదు. అది మీకు అర్థమైతే మీలో ఎంత దుఃఖం ఉన్నా ఆ దుఃఖం అంతా సుఖంగా మారిపోతుంది, మీలో అశాంతి ఉంటే శాంతిగా మారిపోతుంది. ఇది రమణఉవాచ.

మీరు ధనవంతులు అవ్వాలి అనుకొంటున్నారు, ధనవంతులు అవ్వండి మంచిదే. మీ ఇంట్లో ధనం ఉండటమే కాదు, మీ మనస్సులో ధనం ఉండాలి, మీ బుద్ధిలో ధనం ఉండాలి. మీ డబ్బుతో పాటు బుద్ధి కూడా పెరగాలి. డబ్బు పెరిగిపోతూ, బుద్ధి పెరగకపోతే

మీరు పాడైపోతారు. రాముడు మంచి చేస్తాడు, మౌనంగా ఉంటాడు అందుచేత ఆయన దేవుడు అయ్యాడు. మనం మంచి చేస్తాము, మనకు పబ్లిసిటీ కావాలి, అది అందరికీ తెలియాలి అనుకొంటాము, దాని వలన అహంకారం పెరుగుతుంది. రాముడు ధర్మస్వరూపుడు. ఇంట్లోకాని, గ్రామాలలోకాని పేచీలు ఎందుకు వస్తాయి అంటే ఇంట్లో పదిమంది ఉన్నారు అనుకోండి, పదిమంది ధర్మంగా ఉండరు, అక్కడ నుండి పేచీలు ప్రారంభమవుతాయి. గ్రామంలో కూడా అందరూ ధర్మంగా ఉండరు, దానివలన పేచీలు వస్తాయి. ధర్మంగా ఉంటే అసలు పేచీలు రావు. నలుగురు కలిసి వ్యాపారం చేస్తారు, ఒక సంవత్సరంలో పేచీలు పెట్టుకొంటారు, విడిపోతారు. వారిలో ధర్మం ఉంటే కదా, వాడిని మోసం చేయాలని వీడు, వీడిని మోసం చేయాలని వాడు అనుకొంటే ఆ వ్యాపారం ఎంతకాలం నడుస్తుంది. మీ మనస్సుకు చాపల్యం లేకుండా, మీ మనస్సును నిదానంగా పట్టి ఉంచేదే ధర్మం. మీరు ధర్మాన్ని ఆచరిస్తూ ఉంటే మీరు మోక్షం కావాలి అని అడగనక్కరలేదు, మోక్షం వచ్చి మీ ఇంటి తలుపులు తడుతుంది, అది ధర్మం యొక్క వైభవం. గురువు మాట్లాడితే అనుగ్రహం, ఆయన మౌనంగా ఉన్నా అదీ అనుగ్రహమే. చల్లగా చూస్తాడు అనుకోండి, ఆ చూపు అనుగ్రహం. కూర్చొంటే అనుగ్రహం, నిలబడితే అనుగ్రహం. అంతా అనుగ్రహమే. ఆయన అనుగ్రహస్వరూపుడు ఎందుచేతనంటే గురువు అనుగ్రహించాలని అనుగ్రహించడు, అనుగ్రహించకుండా ఉండలేడు కాబట్టి అనుగ్రహిస్తాడు. ఆయన ప్రేమించాలని ప్రేమించడు. ప్రేమించకుండా ఉండలేడు కాబట్టి ప్రేమిస్తాడు, దానికి ఏమీ హద్దులు లేవు, విశ్వవ్యాపకం.

ఈమధ్య విశాఖపట్నం నుండి ఒక డాక్టరు గారు నన్ను కలవటానికి వచ్చారు. ఆయన వెళ్ళేటప్పుడు ఆ డాక్టరుగారితో మీరు అంటే నాకు ఇష్టం అని అన్నాను. ఆ డాక్టరుగారు ఏమన్నారు అంటే నాన్నగారు మీరు అలా అనకండి, మీకు ఇష్టం ఏమిటి? మీకు అయిష్టం ఏమిటి? నేనంటే మీకు ఇష్టం అని అనకండి, ప్రేమ అని చెప్పండి, దానిని ప్రేమ అంటారు అని డాక్టరుగారు చెప్పారు. గురువు మీద ప్రేమ ఉంటే, ఈశ్వరుడి మీద ప్రేమ ఉంటే మనకు ఏమి కలిసివస్తుంది అని అనుకొంటాము. బాహ్యంగా ఆలోచిస్తే దాని లోతు మీకు అందదు. కలిసిరావటం ఏమిటి? మీలో ఉన్న అజ్ఞానం నశిస్తుంది. ఎప్పుడైతే అజ్ఞానం నశించిందో ఇంక మీరు శవాలను మోయనక్కరలేదు. మీకు జ్ఞానం కలిగాక ఈ చావులు, పుట్టుకలు, పుణ్యాలు, పాపాలు, లాభాలు, నష్టాలు, సుఖాలు, దుఃఖాలు అన్నీ స్వప్నం అన్న సంగతి మీకు గోచరిస్తుంది. అది జ్ఞానం యొక్క వైభవం. గురువు యొక్క సమక్షంలో మీరు ప్రశ్నలు

కూడా అడగనక్కరలేదు. ఏమీ అడగకుండానే మీ సందేహాలు తీరిపోతాయి, గురువు సమక్షంలో మీకు బాగుపడాలనే బుద్ధి కలుగుతుంది, మీరు పవిత్రులవుతారు. శాస్త్రంలో ఎన్ని మాటలు చెప్పినా గురువు యొక్క దయ ముందు అన్నీ రెండవ పక్షం. పూర్వజన్మలనుండి మనం చేసుకొన్న పుణ్యం పంటకు వస్తే అప్పడు ఈశ్వరుడు గురురూపంలో వస్తాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-04-2006, భీమవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

రాముడి అన్నదమ్ముల నుండి మనం నేర్చుకోవలసింది ఐకమత్యం. భరతుడుతల్లి చెప్పుడు మాటలు వింది కాని రాముడి అన్నదమ్ములు ఎవరూ చెప్పుడు మాటలు వినలేదు. చెప్పుడు మాటలు వినటం వలన కుటుంబాలు పాడైపోతాయి. రాముడి అన్నదమ్ముల దగ్గరకు వెళ్ళి ఒకరిమీద ఒకరికి విభేదాలు కలిగించే మాటలు చెప్పినా వారు నమ్మరు, మన కుటుంబాన్ని పాడుచేయటానికి చెపుతున్నారు అని వారు గ్రహించేస్తారు. మంచివారు కూడా చెడు స్నేహాల వలన పాడైపోతారు, కైక మందర మాటలు వినటం వలన పాడైపోయింది. మనం చేసే స్నేహాల విషయంలో, చదివే గ్రంథాల విషయంలో, తినే తిండి విషయంలో, మనకు వచ్చే ఆలోచనల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మన శాంతి ఎవరో ఇతరుల మీద ఆధారపడి లేదు. తాత్కాలికమైన సంతోషాలకోసం, తాత్కాలికమైన ఉద్రేకాలకోసం మనం ఆత్మజ్ఞానాన్ని వదులుకోకూడదు. మనకు వచ్చే తలంపులు ఉద్రేకపూరితంగా ఉంటే భవిష్యత్‌లో మనకు తప్పక అశాంతి వస్తుంది. మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలంటే ప్రతీ విషయంలోను, ప్రతీక్షణం కూడా జాగ్రత్తగా ఉండాలి, అజాగ్రత్త పనికిరాదు, అవినయం పనికిరాదు.

జైనమత స్థాపకుడు మహావీరుడు. ఆయన పేరు వర్థమానుడు. ఆయనకు మహావీరుడు అనే బిరుదు, ఆ బిరుదు ఎందుకు వచ్చింది అంటే ఆయన బాహ్యంగా ఏమీ సామ్రాజ్యాలు ఆక్రమించుకోలేదు, ఆయన నూటికి నూరుపాళ్ళు ఇంద్రియాలు, మనస్సును జయించాడు కాబట్టి వర్థమానుడికి మహావీరుడు అని బిరుదు వచ్చింది. ఆయనకు మహావీరుడు అనే బిరుదు ఎందుకు వచ్చిందో గుర్తు పెట్టుకోండి. ప్రపంచంలోని ఏ ఆకర్షణలు, ఏ భోగాలు ఆయన మనస్సును బాహ్యముఖానికి తీసుకొని రాలేదు, వాడు మహావీరుడు. ఆయన ఒక మాట చెప్పారు ఒకవేళ మీకు మనస్సును జయించటం, ఇంద్రియాలను జయించటం సాధ్యంకాకపోతే అవసరమైతే మీ శరీరాన్ని కొంత శుష్కింపచేసి అయినా ఇంద్రియాలను, మనస్సును మీరు స్వాధీనంలోనికి తెచ్చుకొంటేనే కాని హృదయంలో

ఉన్న అంతర్యామి మీకు ఎరుకలోనికి రాడు అని చెప్పారు. రాముడు అన్నదమ్ములు చిన్న పిల్లలుగా ఉన్నప్పుడు నలుగురు కలిసి ఆడుకొనేవారు. ఒకసారి భరతుడు ఏడుస్తూ కౌసల్య దగ్గరకు వచ్చాడు. ఎందుకు బాబు ఏడుస్తున్నావు, ఆటలలో ఓడిపోయావా అని అడిగింది. నేను ఓడిపోతే నాకు దుఃఖం రాదు, నా చేతిలో రాముడు ఓడిపోయాడు అందుకు నాకు దుఃఖం వస్తోంది అని చెప్పాడు. రాముడు కూడా తమ్ముడిని నెగ్గించటం కోసం, వాడి సంతోషం కోసం ఓడిపోవాలనే ఓడిపోయాడు, అది వారి సోదరప్రేమ. మనం పరీక్షలో ఫెయిల్ అయ్యాము అనుకోండి దుఃఖం వస్తుంది. ఆటలలో ఓడిపోయాము అనుకోండి దుఃఖం వస్తుంది. ఎవరైనా అవమానం చేసారు అనుకోండి, మనకు దుఃఖం వస్తుంది. ఇదంతా ప్రపంచమే, ఇదంతా ప్రకృతే. ఒక్క విషయం మీరు గుర్తుపెట్టుకోండి ఈ జయాలు అపజయాలు, గౌరవాలు అగౌరవాలు, సమాజంలో జరిగే ఊరేగింపులు ఇవన్నీ అహంభావనకే కాని లోపలఉన్న చైతన్యానికి వీటితో ఇసుమంతయు సంబంధం లేదు. ఇది మీకు అర్థమైతే జయాపజయాల వలన గాని, లాభనష్టాలవలనకాని మీకు వికారం రాదు, మనోచాపల్యం రాదు. మీకు ఏదైనా కలిసి వచ్చింది అనుకోండి, జయం కలిగింది అనుకోండి దానికి గర్వం వచ్చింది అనుకోండి మీకు జయం కలిగింది అనుకొన్నా మీరు ఓడిపోయిన వారితో సమానము. మీరు బాహ్యంగా నెగ్గారు కాని లోపల కుళ్ళిపోతున్నారు. మీరు లోపల కుళ్ళిపోతూ ఉంటే బాహ్యంగా జయం కలిగినా ఏమిటి ప్రయోజనం? మీకు కలిగే జయాలు లోపల వికారాలను తీసుకొని వస్తూ ఉంటే మీరు నెగ్గినవారితో సమానం కాదు, ఓడిపోయిన వారితో సమానం ఇది మీరు గుర్తు పెట్టుకోండి.

మీకు డబ్బు ఉంటే పది కాసులు బంగారం కొనుక్కోవచ్చు కాని మనస్సును బంగారం చేసుకోవడం చాలా కష్టం. ఎంతో సాధన చేస్తేగాని, గురువు అనుగ్రహం ఉంటే గాని అది సాధ్యం కాదు. నాకు ఆకలిగా ఉంది అనుకోండి, మీరు అన్నం తింటే నా ఆకలి తీరదు, నేను తింటే నా ఆకలి తీరుతుంది. అలాగే నాకు ఏదైనా దుఃఖం వస్తూ ఉంటే, అశాంతి వస్తూ ఉంటే మీకు జ్ఞానం రావటం వలన నా దుఃఖం, అశాంతి పోదు. నాకు జ్ఞానం కలిగితే నాలో ఉన్న అశాంతి, దుఃఖం నశిస్తాయి. ఇది సామూహికంగా సాధించేది కాదు, ఏ మనిషికి ఆ మనిషి ఎంతోకొంత కృషి చేయాలి, జిజ్ఞాస ఉండాలి. రావణాసురుడు రాక్షసుడు అనుకొంటాము, కంసుడు రాక్షసుడు అనుకొంటాము. వారు కాదు రాక్షసులు, మనలో ఉన్న రాగద్వేషములే రాక్షసులు. బయట ఉన్న రాక్షసులను జయించటం కంటే మనలో ఉన్న రాక్షసులను జయించటం చాలా కష్టం. వాడిలో ఉన్న రాక్షసులను జయించాడు కాబట్టే, రాగద్వేషాలనుండి పూర్తిగా

విడుదల అయ్యాడు కాబట్టే వర్థమానుడు మహావీరుడు అయ్యాడు.

ఎవరి దగ్గరమంచి ఉన్నా అది మనం నేర్చుకొంటే మనం బాగుపడతాము. మంచిని నేర్చుకోవటానికి ప్రయత్నం చేస్తే భౌతికంగా అభివృద్ధిలోనికి వస్తాము, ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వస్తాము. ఇది ఒక ఆస్థి కింద మనం జాగ్రత్త పెట్టుకోవాలి. మీ బంగారాన్ని మీరు ఎలా జాగ్రత్త పెట్టుకొంటున్నారో అలా జాగ్రత్త పెట్టుకోండి. మనం పని చేసి కర్మఫలాన్ని ఆశిస్తూ ఉంటాము. ఈ పని చేసాము, ఈ ఫలితం వస్తుంది అని ఆశిస్తూ ఉంటే మనకు పునర్జన్మలు రాకుండా భగవంతుడు కూడా ఆపుచేయలేడు. జీవుడు ఎంతకాలం అయితే కర్మఫలాన్ని ఆశిస్తాడో అంతకాలం వాడు జననమరణ ప్రవాహంలో ఉండవలసిందే, ఆ మాయలో నుండి అజ్ఞానంలో నుండి బయటకు వచ్చే అవకాశం లేదు. మనం ఎప్పడూ ఏదో ఆశించటం వలన అనారోగ్యానికి గురి అవుతాము. పనికి పనే ఫలితం అనుకొన్నప్పడు శారీరకఆరోగ్యం బాగుంటుంది, మానసికఆరోగ్యం బాగుంటుంది. మనం ఏదైనా ఒక మంచి పని చేసాము అనుకోండి ఒకోసారి దానివలన ఫలితం రాకపోయినా మనకు సంతృప్తి మిగులుతుంది. జీవితంలో ప్రతీమనిషికి సంతృప్తి అవసరం. మన సంతృప్తి కోసం అయినా కొన్ని మంచిపనులు చేయాలి, వారి దగ్గర నుండి కృతజ్ఞత కూడా ఆశించనక్కరలేదు. ఆశించటం వలన నీ మనస్సు ఉద్రేకపడుతుంది. ఆశింపు లేకపోతే మనస్సుకు ఉద్రేకం రాదు. ఆశింపు లేనప్పడు నీకు నిరాశ కూడా ఉండదు, నిద్ర సుఖంగా పడుతుంది, నీవు మానసిక అశాంతికి గురి అవ్వవు. అంతా ఈశ్వరసంకల్పంతో నడుస్తోంది, ఇది తెలుసుకోవటం కావాలి అని భగవాన్ చెప్పారు. భగవాన్ చెప్పిన ఈ మాటను మననం చేసుకోండి.

ఈ శరీరాన్ని విడిచిపెట్టి జీవుడు బయటకు వెళ్లే టైములో మన హృదయంలో ఉన్న శాంతి, ఆనందం నూటికి నూరుపాళ్లు మనకు అందితే అదే కడసారి జన్మ, ఇంక శవాలను మోయనక్కరలేదు. ఇంకో గంటకు చనిపోతారు అనగా ఈ మధ్య ఒకరిని మీరు నూటికి నూరుపాళ్ళు సుఖంగా ఉన్నారా అని నేను అడిగాను. నేను సుఖంగా లేను, ఉన్నానని ఎలా చెపుతాను. నూటికి నూరుపాళ్లు సుఖంగా ఎలాగూ లేను, కొంచెం కూడా సుఖంగా లేను అన్నారు అలాగని ఆయనకు బాహ్యంగా ఏమీ లోటు లేదు. దేహంతో తాదాత్మ్యం, మనస్సుతో తాదాత్మ్యం, లోకంతో తాదాత్మ్యం, కులంతో తాదాత్మ్యం, ప్రాంతంతో తాదాత్మ్యం ఇలా నీవు కానిదానితో దేనితో తాదాత్మ్యం పొందినా పరిణామంలో నీకు దుఃఖమే మిగులుతుంది. దేశభక్తిలో ఏముంది అని మీరు అనుకోవచ్చు. దేశభక్తి వలన హృదయం విశాలమవుతుంది, మనస్సు విశాల మవుతుంది, చిత్తశుద్ధి కలుగుతుంది. దేశభక్తి వలన మన మనస్సులో ఏమైనా

మురికి గుంటలు ఉంటే అవి పోతాయి, మనస్సులో ఉన్న ఇరుకుతనం పోతుంది. ఏమతస్థుడు అయినా, ఏ కులస్థుడు అయినా చిత్తశుద్ధి అనే గేటు ద్వారానే మోక్షం పొందాలి, చిత్తశుద్ధి లేకుండా మోక్షాన్ని పొందే అవకాశం లేదు. నువ్వు వివేకాన్ని పెంచుకో, వైరాగ్యాన్ని పెంచుకో. నువ్వు జాగ్రత్తగా వివేకాన్ని, వైరాగ్యాన్ని పెంచుకొంటూ వస్తే నీ మనస్సు వెళ్ళి గూటిలో పడిపోతుంది. మనం ఎంత సేపు నేను, నాది అంటాము. ఈ నేను అనే ఫీలింగ్, నాది అనే ఫీలింగ్ ఇవి రెండూ పెద్ద గుల్లలు కాని వీటిని మనం బంగారపు కడ్డీలు అనుకొంటున్నాము, అందుచేత వీటిని విడిచిపెట్టలేకపోతున్నాము. రోడ్డు మీద ఉన్న గడ్డి పరకకు ఉన్న విలువ కూడా వీటికి లేదు. వీటిలో నుండి విడుదల పొందకుండా ఎవడికీ బ్రహ్మానుభవం కలుగదు. ఈ నేను, నాది అనేవి ఎంత బలంగా ఉన్నాయి అంటే మనం ఎన్ని సాధనలు చేసినా అందులో నుండి బయటకు రాలేకపోతున్నాము. ఎవడైతే ఈ రెండు ఫీలింగ్స్‌లో నుండి విడుదల పొందాడో, ఇప్పుడు మనకు నేను అనేటప్పటికి దేహము ఎలా స్ఫురిస్తోందో వాడికి నేను అనేటప్పటికి బ్రహ్మం స్ఫురిస్తుంది. ఇంక వాడికి రాకపోకలతో పనిలేదు.

కొంతమందికి పేరు అంటే విపరీతమైన పిచ్చ, ఆ పేరుతో తాదాత్మ్యం. మనం పుట్టినప్పుడు మనం మొఖం మీద పేరు వ్రాసుకొని వచ్చామా, ఎవడో ఆ పేరు పెట్టాడు, అది వేసుకొని తిరుగుతాము, ఆ పేరు అంటే మనకు చాలా ఇష్టం. చందాలు కూడా పేరు కోసమే ఇస్తాము, ఏదో ఒక ఐటమ్‌కు నా పేరు పెట్టండి 4 లక్షలు కాకపోతే 6 లక్షలు ఇస్తాను అని అంటాము, పాపం ఆ పేరులో ఏదో ఉందని వాడికి అనిపిస్తుంది. అది ఒక గుల్ల, అది ఒక డొల్ల అందులో ఏమీ లేదు అని వాడికి తెలియటం లేదు. ఈ నేను అనే తలంపులో, నాది అనే తలంపులో ఏదో ఉంది, ఏదో ఉంది అని ఊహించుకొంటాము, అలా ఊహించుకోవటంలోనే అవి బలపడిపోతున్నాయి. మనం చేస్తున్న సాధనలు ఎలాగ ఉన్నాయి అంటే ఈ సాధనల పేరు మీద వాటిలో నుండి విడుదల పొందటం మాట ఎలా ఉన్నా, నేను, నాది అనే తలంపులు ఇంకా బలపడిపోతున్నాయి. మీకు మిగతా తలంపులు ఎన్ని వచ్చినా దేహము నేను అనే తలంపును కేంద్రంగా చేసుకొని ఇతర తలంపులు అన్నీ వస్తున్నాయి. ఆత్మజ్ఞానసముపార్జన కోసం బుద్ధుడు ఒక మహా సామ్రాజ్యాన్ని విడిచిపెట్టాడు. నేను సామ్రాజ్యాన్ని విడిచిపెట్టాను అనే తలంపుకూడా మనస్సులో ఎప్పడూ రాలేదట, వాడు బుద్ధుడు.

మనం అందరం గాఢనిద్రలో ఆనందంగా ఉన్నాము కాని జాగ్రదవస్థలో ఆనందంగా ఉండలేకపోతున్నాము. ఎందుకు ఉండలేకపోతున్నాము. మనకు ఎవరు అడ్డువస్తున్నారు.

ఈ నేనే మనకు అడ్డు వస్తోంది. ఈ నేను ఎవరు? ఎక్కడ నుండి వస్తోంది? వాడు నీలోపల నుండే వస్తున్నాడు కాని ఎక్కడ నుండి వస్తున్నాడో మనకు తెలియటం లేదు. ఆ నేను ఎక్కడ నుండి వస్తోందో అక్కడే ఈశ్వరుడు ఉన్నాడు, అక్కడే సుఖం ఉంది, అక్కడే నిర్వాణస్థితి ఉంది, మూలతలంపు మూలంలోనే మన కంట్రోలర్ ఉన్నాడు. మూలతలంపు దాని మూలంలోనికి వెళ్ళినప్పడు అక్కడ ఉన్న వస్తువు మనకు ఎరుకలోనికి వస్తుంది. అది బాహ్యంగా చూసేది కాదు, దానికి లోచూపు నేర్చుకోవాలి. నేను, నేను అనేది మూలతలంపు, దానిని ఉపసంహరించి ఉపసంహరించి దాని మూలంలోనికి పంపితే మూలతలంపు దాని మూలాన్ని ఎప్పడైతే చూసిందో అప్పడు మూలతలంపు నశిస్తుంది, దాని మూలంలో ఉన్న బ్రహ్మం నీకు ఎరుకలోనికి వస్తుంది. మూలతలంపు నశిస్తే నువ్వు నశించవు, నువ్వు ఏదిగా ఉన్నావో అది నీకు ఎరుకలోనికి వస్తుంది. జ్ఞానం కలిగాక అప్పడు కూడా మీకు దేహం ఉంటుంది కాని ఆ దేహం నేను అని మీరు అనుకోరు, నాకో దేహం ఉంది అనుకొంటారు దేహం నేను అనుకోవటం వేరు, నాకో దేహం ఉంది అనుకోవటం వేరు, మనకు తలంపు లేకపోతే, ఆలోచన లేకపోతే ఏ పని చేయలేము అనుకొంటాము. మీరు కూల్‌గా ఉండండి, క్వయిట్‌గా ఉండండి, రాగద్వేషాలను తగ్గించుకోండి. ఎప్పడైతే అహంకార రహితుడు అయ్యాడో, వాడి శరీరాన్ని ఈశ్వరుడు స్వాధీనం చేసుకొని ఆ శరీరం ద్వారా ఎప్పడు ఏ పని ఎలా జరగాలో అంతా సమగ్రంగా, సక్రమంగా చేయిస్తాడు. వాడు ఈశ్వరుడు. అర్జునా పని నాది, గౌరవం నీది అంటాడు పరమాత్మ. నీ దేహం ఏ పని చేయటం కోసం ఈ భూమి మీదకు వచ్చిందో అది నీకు ఇష్టం ఉన్నా జరుగుతుంది, ఇష్టం లేకపోయినా జరుగుతుంది. ఇష్టంగా కనుక నీవు ఆ పని చేస్తూ ఉంటే కొత్తవాసనలు రావు, పాత వాసనలు పోతాయి, ఈశ్వరుని దయకు పాత్రుడవు అవుతావు. ఏది ఎప్పడు జరగాలో అప్పడు జరుగుతుంది, ఆ టైము వచ్చినప్పడు ఆ పని జరుగుతుంది కాని ఈ లోపుగా నీవు తొందరపడినా రాదు. ఏవో శారీరక బాధలు ఉండి వాటిని భరించలేక మీ ప్రాణం పోవాలి అనుకొన్నా, ప్రాణం పోదు. ఆ ప్రాణ ప్రయాణ సమయం వచ్చినప్పడు నీవు ఆగమన్నా ఆగదు, నీవు దానికి లొంగిపోవలసిందే, అది ఈశ్వరనియమం.

ఈ ప్రపంచంలో ఉన్న సంపద అంతా భగవంతుడిదే. ఒకో మనిషికి ఒకో సంపద కొంత కేటాయిస్తాడు. ఇప్పడు మీ మనవడికి ఐదు రూపాయలు ఇచ్చారు అనుకోండి, దానితో వాడు కొద్దిసేపు ఆడుకొని తిరిగి మీకు ఇచ్చేస్తాడు, మీకు ఇచ్చేటప్పడు వాడు ఏమనుకొంటాడు అంటే మా తాతయ్యకు ఐదు రూపాయలు ఇచ్చాను అనుకొంటాడు.

మనం చేసేది కూడా అలాగే ఉంది. భగవంతుడు మనకు ఇచ్చింది తిరిగి ఆయనకు ఇచ్చి దానం చేసాము అనుకొంటాము. గుడికి వెళ్ళి పది రూపాయలు వేసి దేవుడికి పది రూపాయలు ఇచ్చాము అనుకొంటాము. ఆ పది రూపాయలు ఆయనే మనకు ఇచ్చాడు అని మనకు తెలియటం లేదు. నీకు ధనం ఇచ్చినా, తెలివి ఇచ్చినా, ఏదైనా వైభవం ప్రసాదించినా అది దేవుడు ఇచ్చిందే, ఆయన అనుగ్రహం లేకుండా నీకు ఏదీ రాదు. నీ తెలివి తేటల వలన ఏదీ రాదు, నువ్వు ఎంత, నీ అహంకారం ఎంత, నీ జీవితంఎంత, నీవు చేసిన కృషి ఎంత. ఒక సామాన్య మానవుడిలో ఎవరిలో లేని వైభవం మీలో ఉంది అనుకోండి, అది దేవుడు ఇచ్చిన వరం, అది మీ సొంతం కాదు, అది మర్చిపోవద్దు. అది దేవుడు మనకు ఇచ్చిన వరం అని ఆయనకు కృతజ్ఞత చూపించటం మానేసి, ఆ గిఫ్టు మన సొంతం అనుకొని అహంభావన పెంచుకొని పతనమైపోతున్నాము.

ఈశ్వరసంకల్పానికి భిన్నంగా ఏదీ జరగదు. ప్రతీ సంఘటన కూడా ఈశ్వరసంకల్పం ప్రకారం నడుస్తుంది. మాకు శాంతి కావాలి, మాకు జ్ఞానం కావాలి అని ఎవరైనా భగవాన్‌ను అడిగితే ఉన్నదే అది అనేవారు భగవాన్. నీకు తెలుసున్నా, నీకు తెలియకపోయినా నీ లోపల జ్ఞానం ఉంది. అది తెలిస్తే సుఖం, అది తెలియకపోతే దుఃఖం. నీలోపల ఉన్న జ్ఞానం నీకు అందకుండా ఏ విషయాలు అయితే అడ్డు వస్తున్నాయో వాటిని తీసి ఒక ప్రక్కన పెట్టాలి, అదే సాధన. మన హృదయం కనుక మనం ఖాళీ చేయగలిగితే ఈశ్వరుడు ఎరుకలోనికి రావటానికి ఒక్క క్షణం కూడా వెయిట్ చెయ్యడు. మనం నోటితో మాట్లాడేమాట, మనం చేసే పని, మనకు వచ్చే తలంపులు ఇవన్నీ సత్వగుణాన్ని పెంచాలి. సాత్వికబుద్ధి లేనివాడిని రంపం పెట్టి కోసినా బ్రహ్మజ్ఞానం కలుగదు. మీరు చేసేపని నిర్మలంగా, కూల్‌గా చేసుకొంటూ వెళ్ళాలి. గుర్తింపులు జోలికి వెళ్ళవద్దు. గుర్తింపులు కోరుకొంటే దేహాభిమానం పెరుగుతుంది. మీరు భక్తి యోగంలో ప్రయాణం చేసినా, కర్మయోగంలో ప్రయాణం చేసినా, జ్ఞానయోగంలో ప్రయాణం చేసినా, అన్ని యోగాలను సమన్వయం చేసుకొంటూ ప్రయాణం చేసినా దేహాభిమానాన్ని తగ్గించు కోవాలి, వాటి ప్రయోజనం అదే.

ఏండ్రిన్ కళ్ళతోటి చూసినా ప్రమాదంలేదు, లోపలకు తీసుకొంటే చాలా ప్రమాదం. అలాగే మనం పొగడ్తలను, విమర్శలను లోపలకు తీసుకొంటే చాలా ప్రమాదం, వాటివలన దేహాభిమానం పెరుగుతుంది. దేహబుద్ధి తగ్గించుకో, ఆత్మబుద్ధి పెంచుకో అని శాస్త్రాలు చెపుతున్నాయి. అది రోజూ చదివినా ప్రయోజనం లేదు, ఎంతోకొంత ప్రాక్టీసు చెయ్యాలి. నా మాయను ఎవరు జయించలేరు అని పరమాత్మ గీతలో చెప్పాడు. నా పాదాలను

ఎవడైతే ఆశ్రయించాడో, ఎవడైతే నేనే సర్వస్వం అనుకొని జీవిస్తున్నాడో, ఎవడైతే నా ఇష్టాన్ని వాడి ఇష్టంగా చేసుకొంటున్నాడో అటువంటి భక్తుడికి మాత్రమే నా మాయ దారి ఇస్తుంది కాని అందరికీ మాయ దారి ఇవ్వదు. ఒకోసారి మనకు ఇష్టం లేని పని కూడా మన ద్వారా చేయిస్తాడు. ఈ పని జరుగదు అనుకొన్నప్పడు కూడా ఏదో రకంగా ఆ పని అయిపోతుంది అంటే దాని అర్థం ఏమిటి ఈశ్వరసంకల్పంలో ఉన్నది ఆగదు. ప్రతీ మనిషిని బంధించేది వాడి రూపబుద్ధి, నామబుద్ధి. ఈ దేహం నాది, ఈ పేరు నాది, ఈ మనస్సు నాది, ఈ పరిసరాలు నావి అని ఏదో ఒక శరీరంతోటి, ఒక పేరుతోటి, ప్రాంతంతోటి తాదాత్మ్యం పొందుతాడు. అక్కడనుండే దుఃఖం ప్రారంభమవుతుంది. అసలు దుఃఖం యొక్క సోర్సు అక్కడ ఉంది, అక్కడ కట్ చేయాలి. ఇలా రూపంతోటి, నామంతోటి తాదాత్మ్యం పొందుతున్నంత కాలం నీవు ఎన్ని యోగాభ్యాసాలు చేసినా దుఃఖంలో నుండి బయటకు రాలేవు. ఒకవేళ యోగాభ్యాసాలు చేస్తే శారీరకఆరోగ్యం బాగుంటుంది కాని లోపలఉన్న అజ్ఞానం అనే తాడు తెగదు. అజ్ఞానం అంటే ఏమిటి? నువ్వు ఎవడివో నీకు తెలియకపోవటమే అజ్ఞానం. నీకు వివేకం లేనప్పడు, వైరాగ్యం లేనప్పడు ఇందులో నుండి నీవు బయటకు రాలేవు. భక్తి చేసే పని టెక్నాలజీ చేయలేదు. భక్తి లేకుండా మనకు భగవంతుడితో అనుసంధానం కుదరదు. భక్తి వలన అసాధ్యాలు కూడా సాధ్యాలు అవుతాయి. మన హృదయంలో ఉన్న అంతర్యామితో మనలను అనుసంధానం చేసేది భక్తి మాత్రమే. మీకు భక్తి ఉంటే మీరు చేసే పని సక్రమంగా, శ్రద్ధగా చేయగలరు. భక్తి ఉన్న వాడికి క్రమశిక్షణ వస్తుంది. భక్తి ఉన్న వాడికి ఇహం ఉంటుంది, పరం ఉంటుంది.

మనం ఎంత సేపు బయటకు చూడటం కాదు, లోపలకు కూడా చూసుకోవాలి. మనలో ఉన్న బలహీనతలు ఏమిటి అని జాగ్రత్తగా చూసుకొని, వాటిలో నుండి బయటకు రావటానికి సహాయం చేయమని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆయన దయ వలన ఆ బలహీనతల నుండి బయటకు వస్తే ఈశ్వరుడు మనకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. ఆనందరాజుగారు అన్న మాట నాకు తరచూ గుర్తుకు వస్తుంది. ఈ లోకం ఎంత నిజంగా మనకు కనిపిస్తోందో అంత నిజం కాదు అన్నారు, ఏదో కాకతాళీయంగా ఆయన నోటినుండి ఆ మాట వచ్చింది. మనం ఏమనుకొంటున్నాము ఈ లోకం నిజం, ఈశ్వరుడు అసత్యం అనుకొంటున్నాము. అటువంటప్పడు దైవనామం మనం భక్తితో చేయలేము, నిండు మనస్సుతో అనలేము, ఏదో యాంత్రికంగా చేస్తాము, స్వామి శివానందస్వామి ఏమిచెప్పారు అంటే మీకు ఏదైనా అదృష్టం వస్తుంది అనుకోండి, వస్తే రానివ్వండి దానితో కలిసిపోవద్దు,

మీకు ఏదైనా దురదృష్టం వస్తుంది అనుకోండి, వస్తే రానివ్వండి దానితో కలిసిపోవద్దు. ప్రారబ్దంలో ఏది ఉంటే అది వస్తుంది. దానితో కలిసిపోవద్దు. అదృష్టం వచ్చినా, దురదృష్టం వచ్చినా ఏదీ నిలబడదు, కాలప్రవాహంలో కొట్టుకొని పోతుంది. నీకు దేహం వచ్చింది, దేహం 1000 సంవత్సరాలు ఉంటుందా? అది కూడా కాలప్రవాహంలో కొట్టుకొనిపోతుంది. కాలప్రవాహంలో ఏదీ నిలబడదు. అంతా వాసుదేవమయం, అంతా బ్రహ్మమయం. ఎటుచూసినా బ్రహ్మమే, ఉన్నది ఒక్కటే ద్వితీయం అంటూ లేనేలేదు. నీవు జపం చేసి, ధ్యానం చేసి, నిష్కామకర్మ ఆచరించి, విచారణ చేసి, ఈశ్వరుని పాదాలను ఆశ్రయించి నీవు ప్రయత్నం చేసి నీ బుద్ధిలో ఉన్న దోషాల నుండి విడుదలపొందితే ఇదంతా వాసుదేవమయం అని అప్పడు నీకు తెలుస్తుంది. బహుజన్మల కృషి వలన, సాధన వలన, ఆ పుణ్యబలం వలన ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే, ద్వితీయం లేదు అనే అనుభవం నీకు కలుగుతుంది. అదే నీ కడసారి జన్మ.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-11-2006, పాతాళమెరక

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కువైట్ వెళ్ళి వచ్చాక వారిలో నేను నేర్చుకొన్నది ఏమిటి అంటే ముస్లింలకు ఎక్కడా రూపం గొడవ, నామం గొడవ లేదు. మసీదులో ఎక్కడా నామం లేదు, రూపం లేదు, అల్లా పటం లేదు, అక్కడ రోజా నమాజ్ చేసుకొంటారు, వస్తారు. మనకు భగవద్గీత ఎలా ప్రమాణ గ్రంథమో వారికి ఖురాన్ ప్రమాణ గ్రంథము. నేను ముస్లింల ఇంటికి కూడా వెళ్ళాను, వారి ఇంటిలో తల్లితండ్రుల ఫొటోలు కూడా లేవు. ఏదైనా మంచి కార్యక్రమాలు చేసినా గోడల మీద పేర్లు లేవు. భగవదనుభవం పొందటానికి మనం ఏ మార్గంలో ప్రయాణం చేసినా మనోనిగ్రహం, ఇంద్రియనిగ్రహం చాలా ముఖ్యం. లోకంలో అనేక ఆకర్షణలు ఉంటాయి. మనం ఏదో ఒక ఆకర్షణకు లోబడిపోతూ ఉంటాము, మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది, సాధనలో మనం ఫెయిల్ అవుతూ ఉంటాము. భగవంతుడు సత్యం, ఈ ప్రపంచం అసత్యం అనేది ముందు మన మనస్సులో గాఢంగా నాటుకోవాలి, ఆ విశ్లేషణ మనకు ఉండాలి. భగవంతుడు సత్యం, మిగతాది అంతా స్వప్నమే అనేది దృష్టిలో పెట్టుకొని ఈలోకంలో మనం వ్యవహారం చేయాలి. నది వెళ్ళి సముద్రంలో ఐక్యమయ్యాక ఇది గోదావరి నీరు, ఇది కృష్ణా నీరు అని ఏమీ ఉండదు. అలాగే మనం హృదయంలో ఐక్యం అయ్యాక రూపం గొడవ, నామం గొడవ ఏమీ ఉండదు. రూపబుద్ధి, నామబుద్ధి మనలను బంధిస్తోంది, ఇదే మన దుఃఖానికి కారణం. సత్పురుషులతో సహవాసం వలన, సత్కర్మ చేయటం వలన రూపబుద్ధి,

నామబుద్ధి తగ్గుతుంది. నాన్నగారు అంటూ అసలు లేరు, రామకృష్ణుడు అంటూ అసలు లేరు, ఉన్నది ఒక్కటే, ఉన్నది ఈశ్వరుడే, మనందరం స్వప్నమే అయితే ఈ విషయం మనకు అవగాహనకు రాకుండా మన అహంకారం అడ్డువస్తోంది.

మనందరికి గర్వం ఉంటుంది, అది ఉందన్న సంగతి మనకు తెలియదు. మనకు ఉన్న గర్వం నశించే వరకూ, వ్యక్తిభావన నశించేవరకూ భగవంతుడి యొక్క అస్థిత్వాన్ని మనం అంగీకరించలేము. నాన్నగారు లేరు, సుబ్బమ్మ లేదు, ఎల్లమ్మ లేదు, ఎవరూ లేరు ఉన్నది భగవంతుడు ఒక్కడే. మనలను ఎక్కడైనా కూర్చోబెడితే ఆయనే కూర్చోబెట్టాడు. శరీరం ఇచ్చింది ఆయన, శరీరం తీసుకొని వెళ్ళేది ఆయన, గాలి పోసింది ఆయన, ఆ గాలిని తీసేదీ ఆయనే. అంతా ఆయనే. అక్కడ చెడు వాసన వస్తోంది అనుకోండి, అక్కడ పెంట ఏదో ఉంది. అలాగే మనకు నేను అనే తలంపు, నాది అనే తలంపు వస్తూ ఉంటే అక్కడ అజ్ఞానం ఉన్నట్లు గుర్తు. లోపల అజ్ఞానం లేదు అనుకోండి అసలు నేను అనే తలంపు, నాది అనే తలంపు రాదు. మనం వేదం అంతా శ్రుతి అని చెపుతారు. అది ఆలోచించి వ్రాసింది కాదు, వారు శ్రవణం చేసివ్రాసింది, అందుచేత శ్రుతి అంటారు. అలాగే ఖురాన్ కూడా అల్లా చెప్పింది మహమ్మద్ వ్రాసాడు. ఉన్నది ఈశ్వరుడే, మనం లేము. ఇది మనకి అర్థం అవ్వాలంటే మనకు డిస్క్రిమినేషన్ ఉండాలి.

మనం భగవద్గీత చదివేటప్పడు, ఏదైనా సద్గ్రంధాలు చదివేటప్పడు మనకు ఉన్న పిచ్చంతా ప్రక్కనపెట్టి, మనకు ఉన్న రాగద్వేషములను ప్రక్కన పెట్టి ఆ పుస్తకం చదివితే అది అర్థమవుతుంది కాని లేకపోతే అర్థంకాదు. భగవంతుడి కంటే నేనే తెలివైన వాడిని, నేనే పవిత్రుడిని, భగవంతుడికంటే నేనే శక్తిమంతుడిని అని అనుకొంటూ భగవద్గీత చదువుతూ ఉంటే నాకు గీత ఏమి అర్థమవుతుంది. ఈశ్వరుడి యొక్క శక్తి మనకు తెలియకపోవటం వలన అక్కడ శరణాగతి చెందలేకపోతున్నాము, అదీ కారణం. భగవంతుడి గురించి శ్రవణం చేసి, భగవంతుడు అంటే ఇట్టివాడు, ఆయన చాలా శక్తిమంతుడు అని ఆయన గురించి కొంత అవగాహన మనకు వస్తే అక్కడ మనకు శరణాగతి సాధ్యమవుతుంది. భగవంతుడు కంటే మీరే తెలివైన వారు, మీరే మంచివారు అని మీరు అనుకొంటూ ఉంటే ఇంక మీరు ఆయనకు ఎలా శరణాగతి పొందగలరు. రామకృష్ణ పరమహంసలో గొప్పతనం ఏమిటి అంటే ఆయనలో చిత్తశుద్ధి ఉంది. ఆయనకు ఏమీ చదువు లేదు, ఉపనిషత్‌లు, భగవద్గీత ఏమీ చదవలేదు, అయినా ఆయన లోక గురువు అయ్యాడు అంటే ఆయనలో 100% చిత్తశుద్ధి ఉంది. చిత్తశుద్ధి లేకుండా దేహాభిమానం నశించదు, రూపబుద్ధి నశించదు,

నామబుద్ధి నశించదు. మనలను మనం పవిత్రం చేసుకోవటానికి ప్రయత్నం చేయాలి. మనం అలా ఎందుకు ఉండకూడదు, ఇలా ఎందుకు ఉండకూడదు అనేది మనకు అనవసరం. ఇతరుల మాట వదిలి వేయండి, అనుకరణ పనికిరాదు. మనలోని బలహీనతలు ఏమిటి అని చూసుకొని వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి. వారు అలా ఉన్నారు కదా అని ఇతరులను అనుకరణ చేస్తే మటుకు ఎవడికీ బ్రహ్మానుభవం కలుగదు, జన్మరాహిత్య స్థితిని పొందలేడు.

మన హృదయంలో సత్యం ఉంది, అది 100% కరెక్టు. ఆ స్థితి అంటూ ఒకటి ఉండకపోతే బుద్ధుడూ పొందలేడు, రామకృష్ణుడు పొందలేడు. అది ఉంది కాని అది మన ఇంద్రియాలకు అందదు, మన బుద్ధికి అందదు. మన చిన్నపాటి బుద్ధికి ఈ గోడ ప్రక్కన ఏముందో తెలియదు, ఇంకో క్షణంలో ఏమి జరుగుతుందో తెలియదు కాని మనం దేవుడి గురించి తీర్పులు చెప్పటం. భక్తి పేరుమీద మనం అణకువ నేర్చుకోవాలి, వినయం నేర్చుకోవాలి కాని గర్వం, పొగరుబోతుతనం నేర్చుకోకూడదు. రూపబుద్ధిని, నామబుద్ధిని మనం మేగ్జిమమ్ తగ్గించుకొంటూ రావాలి లేకపోతే ఆత్మానుభవం పొందటం సాధ్యం కాదు. ఉన్నది ఈశ్వరుడే, మనం లేము, మనం ఆయన చేతిలో కేవలం పనిముట్లము మాత్రమే అనే భావన మనకు బలంగా రావాలి. మనకు శారీరకఆరోగ్యం, మానసికఆరోగ్యం అవసరం. ఎందుచేతనంటే ఈశ్వరసాక్షాత్కారం పొందేటప్పుడు కొన్ని ఇంద్రియాలు సహకరిస్తాయి అనుకోండి, కొన్ని ఇంద్రియాలు సహకరించటం లేదు అనుకోండి, మనస్సు కొంతభాగమే సహకరిస్తోంది అనుకోండి అప్పడు ఈశ్వరసాక్షాత్కారం సాధ్యం కాదు. మొత్తం అన్ని ఇంద్రియాలు సహకరించాలి, 100% మనస్సు సహకరించాలి అప్పడు ఈశ్వరసాక్షాత్కారం సాధ్యమవుతుంది. హోలీకంపెనీ అవసరం.

డబ్బుఉన్నవారు అందరూ గొప్పవాళ్ళు, బాగా చదువుకొన్నవారు అందరూ గొప్పవారు అని మనం అనుకొంటాము, భగవంతుడు గొప్పవాడు అన్న సంగతి మర్చిపోయాము. ఎవరికైనా డబ్బు ఉంటే అది భగవంతుడు ఇచ్చినదే, ఎవరికైనా తెలివితేటలు, అధికారం ఉంటే అవి భగవంతుడు ఇచ్చినవే అది వారికి తెలియకపోవచ్చు. వారి దేహప్రారబ్ధాన్ని బట్టి ఒకడికి చదువు రావచ్చు, ఒకడికి ధనం ఉండవచ్చు, ఒకడికి అధికారం రావచ్చు. కాని మనం ఆ డబ్బే గమ్యం, ఆ అధికారమే గమ్యం అనుకొని భగవంతుడు గమ్యం అన్నసంగతి మరచిపోయాము. ఒకసారి చటోపాధ్యాయగారు రామకృష్ణుడి దర్శనానికి వచ్చారు. ఆయన బాగా పండితులు. రామకృష్ణ పరమహంసగారు కొన్ని మాటలు చెపుతూ మీరు బాగా

పండితులు, నేను చెప్పే మాటలు బహుశా మీకు అంత రుచించక పోవచ్చు అన్నారు. అప్పుడు ఆయన రామకృష్ణుడికి నమస్కారం పెట్టి నేను తియ్యటి మాటలు వినటానికి ఇక్కడకు రాలేదు, నేను బాగుపడే మాటలు, నా చైతన్యస్థాయిని పెంచే మాటలు వినటానికి ఇక్కడకు వచ్చాను. నా ఈగోని గ్లోరిఫై చేస్తారని నేను ఇక్కడకు రాలేదు. మీ మాటలు చేదుగా ఉండవచ్చు కాని ఆ మాటల వలన నేను బాగుపడాలి, అవి చేదుగా ఉన్నా నేను స్వీకరిస్తాను. మందులు చేదుగా ఉన్నా ఆరోగ్యం కోసం వాటిని తీసుకొంటాము అలాగే మీ మాటలు చేదుగా ఉన్నా బాగుపడటం కోసం వాటిని స్వీకరిస్తాను అని చెప్పారు. కొంతమంది భక్తి భక్తి అంటారు, శరీరాన్ని ఎక్కడ ముట్టుకొన్నా గర్వమే. చివరకు భక్తి పేరు మీద వారు నేర్చుకొనేది ఏమిటి అంటే భగవంతుడు లేడు, నేను ఉన్నాను అని నేర్చుకొంటున్నారు. ఏసు క్రీస్తు మాటలు గుర్తుకు వస్తున్నాయి. ఓ తండ్రీ! వారు ఏమి మాట్లాడుతున్నారో వారికి తెలియదు, వారిని క్షమించి ఆశీర్వదించు అన్నాడు.

మనం రూపబుద్ధి, నామబుద్ధి తగ్గించుకోవాలి. తల్లి కడుపులో నుండి ఏదో మాంసపుముద్ద బయట పడింది, అన్నం తిని ఇంత పెద్దవాళ్లం అయ్యాము. వ్యవహారం కోసం ఎల్లమ్మ అని, పుల్లమ్మ అని ఒక పేరు పెట్టారు. పేరు లేకపోతే వ్యవహారం నడవదు. ఆ రూపానికి పెట్టిన పేరు మనం అనుకోవటం, ఆ పేరు కోసమే బతకటం, ఆ రూపం కోసమే బతకటం. ఆచార్యులవారు ఏమి చెప్పారు అంటే మొసలిని నమ్ముకొని నదిని దాటుదామను కోవటం ఎటువంటిదో, రూపబుద్ధిని నామబుద్ధిని పట్టుకొని మోక్షం పొందుదామనుకోవటం కూడా అటువంటిదే అని చెప్పారు. మనకు పూర్వపుణ్యం లేకపోతే మహాపురుషుల సాంగత్యం కూడా దొరకదు. మనకు అనుభవం లేనప్పుడు ఆచార్యులవారు చెప్పినది చదివినా ఏమిటి ఇలా చెప్పారు అని మనకు అనిపిస్తుంది. మనకు వయస్సు వచ్చాక, బుద్ధి బాగా పండాక, తినవలసిన మొట్టికాయలు అన్నీ తిన్నాక అప్పుడు ఆచార్యులవారు చెప్పిన మాటలు ఎంత బాగున్నాయి అనిపిస్తోంది. మీరు టీనేజీలో ఉండగా భగవద్గీత చదివినదానికి, జీవితానుభవం పొందాక బాగా సాధన చేసాక చదివిన దానికి తేడా ఉంటుంది. మీకు సాధనా బలం ఉంటే అప్పుడు గీతలోని మాటలు బాగా అర్థమవుతాయి. కృష్ణుడు చెప్పిన మాటలు నిజం కింద అనిపిస్తాయి. మీకు సాధనా బలం లేదు అనుకోండి, తగినంత పుణ్యం లేదు అనుకోండి, సత్పురుషుల సహవాసం లేదు అనుకోండి భగవద్గీత చదివినా మీ అహంకారం నిజం అనిపిస్తుంది కాని భగవంతుడు చెప్పిన మాటలు నిజం అని మీకు అనిపించదు.

లోకంలో నిందా ఉంటుంది, స్తుతి ఉంటుంది. రెండూ బేలెన్స్ చేసుకొంటూ

ఉండాలి. రెండూ నిజంకాదు. లోకం అనేది ఒక ట్రైనింగ్ గ్రౌండ్. స్కూలులో కంటే, కాలేజీలో కంటే జీవితంలో నేర్చుకొనే పాఠాలు ఎక్కువ ఉంటాయి. కేవలం అన్నం తినటానికి, బట్ట కట్టుకోవటానికి ఈ లోకంలోనికి రాలేదు, పాఠాలు నేర్చుకోవటానికి వచ్చాము. పాఠాలు నేర్చుకొని మన మనస్సుని హృదయాభిముఖంగా నడిపిస్తే అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడు మనకు గోచరిస్తాడు, ఆయన మనకు తానుగా వ్యక్తమవుతాడు. మనస్సు ఎంత నిజమో లోకం కూడా అంతే నిజం. మీరు మనస్సును సెపరేట్ చేస్తే లోకం లేదు. గాఢనిద్రలో మీకు మనస్సు లేదు, శరీరం ఉందనే భావన లేదు, లోకం ఉందనే భావన లేదు, మీరు మంచివారము అనే భావన లేదు, చెడ్డవారము అనే భావన లేదు. ఇదంతా ఎక్కడ ఉంది, మనస్సులోనే ఉంది. జాగ్రదవస్థలో మనస్సు వచ్చాక లోకం వస్తోంది, అన్నీ వస్తున్నాయి. మనస్సును ఓవర్‌కమ్ చేస్తే ఏమీ లేదు, ఆ గెడప దాటితే ఏమీ లేదు. అయితే ఈశ్వర అనుగ్రహం లేకుండా, గురువు అనుగ్రహం లేకుండా అది మనకు సాధ్యం కాదు. గురువు అనుగ్రహం అవసరం. గురువు అనుగ్రహం మనకు ఉంటే మనలో ఎంత చెడ్డ సంస్కారాలు ఉన్నా, పెద్ద పెద్ద దుంగల లాంటి బలహీనతలు మనలో ఉన్నా నదికి వరద వచ్చినప్పుడు పెద్ద పెద్ద జంతువులు కూడా ఆ ప్రవాహవేగంలో ఎలా కొట్టుకొనిపోతాయో అలాగ గురువు అనుగ్రహ ప్రవాహంలో మనలో ఉన్న పెద్దపెద్ద బలహీనతలు, పునర్జన్మహేతువులు అలా కొట్టుకొనిపోతాయి. ఈశ్వరుని పాదాలను విడిచిపెట్టవద్దు. ఆ సంఘటన అలా ఎందుకు జరిగింది, ఈ సంఘటన ఇలా ఎందుకు జరిగింది అని ఇటువంటి సందేహాలు నీకు ఎందుకు వస్తాయి అంటే ఈశ్వరుని పాదాలయందు భక్తి లేకపోవటం వలన, శరణాగతి లేకపోవటం వలన వస్తున్నాయి.

మనం ఇంటి దగ్గర ప్రశాంతంగా కూర్చొని మన మనస్సుకు ఎందుకు చలనం వస్తోంది అని చూసుకొంటే దానికి రాగద్వేషములే కారణం. మనం ఏదో ఊహించు కొంటాము, వాడు నాకు ఇష్టుడు అనుకొంటాము, వాడు నాకు అయిష్టుడు అనుకొంటాము. ఇష్టం ఉన్నచోట రాగం వస్తుంది, అయిష్టం ఉన్నచోట ద్వేషం వస్తుంది. అక్కడ నుండి మనస్సు యొక్క చాపల్యం ప్రారంభమవుతుంది. ఈ లోకంలో ఏ దేశం వెళ్ళి చూసినా, ఎవరి ఇంటికి వెళ్ళి చూసినా రాగద్వేషములు తప్పించి ఈ లోకంలో ఏముంది అన్నాడు గౌతమబుద్ధుడు. శాస్త్ర ప్రమాణం లేకుండా చాలామంది మాట్లాడుతూ ఉంటారు, రాగద్వేషములను బట్టే అలా మాట్లాడతారు. రాగద్వేషాలు అనేవి పెద్ద పిచ్చి. దీని వలన మనకు శక్తి వృధా అవుతుంది. మనం ఎవడినైతే ద్వేషిస్తున్నామో ఒకోసారి వాడే మనకు ఉపకారం చేయవచ్చు. మనం ఎవడినైతే ప్రేమిస్తున్నామో ఒకోసారి వాడే మనకు అపకారం

చేయవచ్చు, అది మనం చెప్పలేము. సాధనలో ముఖ్యమైన భాగం ఏమిటి అంటే ఇష్టాలు, అయిష్టాలు కనుక వదిలించుకొంటే మనస్సుకు చాపల్యం తగ్గిపోతుంది. లోపల నూనె లేకపోతే దీపం ఎలా ఆరిపోతుందో అలాగే లోపల రాగద్వేషములు తగ్గిపోతే అక్కడ మనస్సు ఆగిపోతుంది, మనస్సు ఇంక కదలమన్నా కదలదు. చుట్టాలు, చుట్టాలు అని ఇష్టాలు పెంచుకొంటాము, చివరకు వారు చేసేది ఏమీ ఉండదు, బంధువులు అంటేనే బంధించేవారు అని చెపుతారు.

ఆధ్యాత్మికంగా మనం అభివృద్ధిలోనికి రావాలంటే, మన చైతన్యస్థాయి పెంచుకోవాలి అంటే మనకు పాండిత్యం ప్రధానం కాదు, అధికారం ప్రధానం కాదు, మనం రాగద్వేషాలను తగ్గించుకోవాలి. భక్తిలో రెండు రకాలు ఉన్నాయి. ద్వైతభక్తి, అద్వైతభక్తి. రమణమహర్షి గారిది అద్వైతభక్తి. నేను ఒకే వాక్యంలో అడుగుతున్నాను, మీరు ఒకే వాక్యంలో సమాధానం చెప్పండి అని రామకృష్ణ పరమహంస గారితో ఒక భక్తుడు అంటూ జ్ఞానం అంటే ఏమిటి అని అడిగాడు. మనం నేను, నేను అంటాము, ఆ నేను నేను కాదని తెలుసుకోవటమే జ్ఞానం అన్నారు రామకృష్ణుడు. ఎందుచేతనంటే ఆ నేను వచ్చాకే సర్వమూ వస్తోంది, ఆ నేను లేకపోతే ఏదీ లేదు. భక్తి కలిగాక జ్ఞానం వస్తుందా, జ్ఞానం కలిగాక భక్తి వస్తుందా అని నాగపూర్‌లో ఒక లెక్చరర్ గారు నన్ను అడిగారు. భక్తి కలిగాక జ్ఞానం రావచ్చు, జ్ఞానం కలిగాక భక్తి రావచ్చు, ఎటైనా ఒక్కటే, అటు నుండి ఇటు వచ్చినా, ఇటు నుండి అటు వచ్చినా ఆశ్చర్యపడనక్కరలేదు అని నా అభిప్రాయం చెప్పాను. కొంతమందికి సహజంగా భగవంతుడి పట్ల పరిపూర్ణమైన విశ్వాసం ఉంటుంది. కొంతమంది ఈశ్వరుడిపట్ల చాలా కృతజ్ఞతగా ఉంటారు. కృతజ్ఞత అనేది అందరికీ ఉండదు, అది భగవంతుడు ఇచ్చిన వరం అని వాల్మీకి రామాయణంలో చెప్పాడు. కృతజ్ఞత లేనివారికంటే కుక్క మెరుగు అని అనలేదు, కుక్క మాంసం తినేవాడు మెరుగు అని చెప్పాడు. రామకృష్ణుడి దగ్గర ఒక భక్తుడు అన్నాడు. నువ్వు చాలా సాధనలు చేసావు, ఇంద్రియాలను జయించావు. సాధన పేరుమీద నువ్వు కష్టపడిన మాట నిజం. నువ్వు సాధన చేసావు కాబట్టి ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం వచ్చింది. నేను ఏమీ కష్టపడటం లేదు, ఇంద్రియాలను నిగ్రహించుకోవాలి, ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలి అనే కోరికలు నాకు ఏమీ లేవు. నిన్ను తరచుగా వచ్చి చూడటం వలన, రామకృష్ణా, రామకృష్ణా అని నీ నామాన్ని అనుకోవటం వలన నాకు ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం వచ్చేస్తోంది, నువ్వు ఎంతటి వాడవు అయ్యా రామకృష్ణా అంటాడు ఆ భక్తుడు.

పూర్వజన్మ సంస్కారాన్నిబట్టి కొంతమంది భక్తిమార్గం ఇష్టపడతారు, కొంతమంది

జ్ఞాన మార్గం ఇష్టపడతారు, కొంతమంది కర్మమార్గం ఇష్టపడతారు. కొంతమంది స్వార్థం లేకుండా పనిచేస్తూ ఉంటారు. వారికి కీర్తికాంక్ష ఉండదు. కష్టపడి నిర్మలంగా పనిచేస్తూ ఉంటారు, వారికి పబ్లిసిటీ అక్కరలేదు. వీరి గురించి భగవద్గీతలో పరమాత్మ ఏమి చెప్పాడు అంటే వారికి కోరికతో సంబంధం లేకుండా కాలప్రవాహంలో ఏదో ఒక రోజున, ఏదో ఒక టైములో వారికి నేను ఎరుకపడతాను అని పరమాత్మ చెప్పాడు. మీ గుర్తింపులు ఎందుకు అండి, పరమేశ్వరుడు గుర్తిస్తున్నాడు. భగవంతుడి పట్ల పరిపూర్ణమైన విశ్వాసం ఉంటే శరణాగతిమార్గంలో ప్రయాణం చెయ్యండి. భగవంతుడు నిజంగా ఉన్నాడో లేదో అని అటువంటి సందేహాలు వస్తూ ఉంటే విచారణమార్గంలో ప్రయాణం చెయ్యండి. ఏ మార్గంలో ప్రయాణం చేసినా పొందవలసిన గమ్యం ఒక్కటే. ఈ ప్రపంచం అంతా నాది అనుకొని పని చేయటం కర్మమార్గం, ఈ ప్రపంచంలో ఏ వస్తువు నాది కాదు అనుకొని పనిచేయటం జ్ఞానమార్గం. అదీ గమ్యానికి తీసుకొని వెళుతుంది, ఇది గమ్యానికి తీసుకొని వెళుతుంది. మీ మనస్సు ఏ మార్గం వైపుకు ఆకర్షింపబడుతోందో ఆ మార్గంలో ప్రయాణం చేయండి, మీరు తరించటం ముఖ్యం.

మన సంస్కృతి సజీవంగా ఉండాలన్నా, మతం సజీవంగా ఉండాలన్నా, ఉపనిషత్తుల సారం సజీవంగా ఉండాలన్నా వాటిని అధ్యయనం చేసి, అర్థం చేసుకొని, దానిని అనుభవించి, ఇతరులకు ఎవరైతే అనుభవైకవేద్యం చేస్తున్నారో వారి ద్వారా మన సంస్కృతి, మన మతం కలకాలం, చిరకాలం సజీవంగా ఉంటాయి. మనకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా అంతా ఈశ్వరసంకల్పం తోటే నడుస్తోంది. ఈశ్వరుడి ఇష్టమే మన ఇష్టం, ఈశ్వరసంకల్పమే మన సంకల్పం అనుకోవటం భక్తుడి లక్షణం. ఈశ్వరుడు శక్తివంతుడు, జ్ఞానవంతుడు, జీవుడికి అసాధ్యం ఉంటుంది కాని ఈశ్వరుడికి అసాధ్యం అంటూ ఏమీ లేదు. ఈశ్వరుడికి ఉన్న శక్తి మనకు తెలియకపోవటం వలన అక్కడ మనం తలవంచలేకపోతున్నాము. ఆయన వైభవం మనకు తెలియటం లేదు కాబట్టి ఆయన పట్ల మనకు శరణాగతి కుదరటం లేదు. మనం సజీవమైన విశ్వాసం పెంచుకోవాలి. అవినయం రాకుండా చూసుకోవాలి. మనలో ఏదైనా గొప్పతనం ఉన్నా అది భగవంతుడి ఇచ్చిన వరం, అది ఏదో మీ సొంతం అనుకోవద్దు. మనం సమాజానికి కొంత ఉపయోగపడాలి. ఈశ్వరుడు అంటే పూర్ణకాముడు, ఆయనకు నెరవేరవలసిన కోరిక అంటూ ఏమీలేదు, నెరవేరవలసిన పని అంటూ ఏమీ లేదు. నువ్వు ఏదైనా చేస్తే ఆయనకు ఏమీ అక్కరలేదు, నీది నీకే ఇచ్చేస్తాడు. ఇతరులకు ఏ రూపంలో నీవు సహాయ సహకారములు అందించినా అది తిరిగి నీకే వస్తుంది అన్న సంగతి అర్థమైతే

ఇతరులకు సహాయం చెయ్యకుండా నువ్వు ఎలా ఉండగలవు. కొంతమందికి సమాజంలో గౌరవం ఉంటుంది. ఆ గౌరవాన్ని కూడా ఇతరులకు ఉపయోగించవచ్చు. కొంతమంది ఎలా ఉంటారు అంటే వారికి ఉన్న గౌరవాన్ని కూడా ఇతరులకు ఉపయోగించరు, ఎందుకు ఉపయోగించరు అంటే మన సొంతపని వచ్చినప్పుడు ఉపయోగించుకొందాము అనుకొంటారు. ఇతరులకు ఏదైనా సహాయం చేస్తే ఆ డబ్బు పోయింది అనుకోవద్దు, ఇతరులకు సహాయం చేసిన డబ్బు అంతా భగవంతుడు తన బ్యాంక్‌లో వేసుకొని మరణానంతరం అది మీకు ఇస్తాడు, ఆయనకు ఏమీ అక్కరలేదు.

భగవంతుడు చెప్పిన మాటలు అర్థం చేసుకోవాలి అంటే మనం ఆ స్థాయికి పెరిగితేనే గాని అవి మనకు అర్థం కాదు. మనకు ఎప్పుడైనా ఉమ్మి వచ్చింది అనుకోండి, వెంటనే ఊసేస్తాము, దాని గురించి ఆలోచించము. మహాత్ములు కూడా శరీరం విడిచి పెట్టేటప్పుడు అది ఏమౌతుందని దాని గురించి ఆలోచించరు. రామకృష్ణుడిలో ఏదైనా మంచితనం ఉంది అనుకోండి, ఆ మంచితనం మనలో ఉంటే అది మనకు అర్థమౌతుంది కాని లేకపోతే అర్థంకాదు. ఒక గ్రేట్‌మేన్‌ను అర్థం చేసుకోవాలంటే ఇంకో గ్రేట్‌మేన్ ఉండవలసిందే, చిన్న మనస్సులకు అర్థమయ్యే విషయాలు కాదు. ఎవరైతే మంచి పనులు చేస్తున్నారో వారిని మనం మర్చిపోకూడదు. శివవర్మ మంచిపని చేసారు అని, రామకృష్ణ గారు మంచిపని చేసారు అని మనం చేయలేకపోవచ్చు, అందరికీ భగవంతుడు అవకాశాలు ఇవ్వడు కాని దురదృష్టం ఎక్కడ ఉంది అంటే ఈ సమాజంలో మంచిపనులు చేసే వారిని చూసి, వారిని గౌరవించే శక్తిని కూడా మనం కోల్పోయాము, ఆ మంచిపనిని చూసి మనం ఎంజాయ్ చేయలేక పోతున్నాము, ఇదీ నేటి సమాజం. దీనికి మనలో ఉన్న అసూయ కారణం. అర్జునా! నీవు అనసూయుడవు, ఆ గ్రేట్ క్వాలిటీకి, గుడ్ క్వాలిటీకి లొంగిపోయి గీతాశాస్త్రాన్ని నీకు బోధిస్తున్నాను అని పరమాత్మ చెప్పాడు. దేహప్రారబ్దాన్ని బట్టి ఎవరికి ఇచ్చేది వారికి భగవంతుడు ఇస్తాడు, మనం ఎవరిని చూసి అసూయపడకూడదు. భగవంతుడు మనకు ధనం కేటాయించలేదు అనుకోండి, దానిపై మనకు కోరిక ఉన్నా, మనం కావాలి కావాలి అన్నా అది రాదు భగవంతుడు మనకు కేటాయించినది మన కోరికతో సంబంధం లేకుండా, మనం వద్దు వద్దు అన్నా కూడా అది మనలను వరిస్తుంది. మీరు జపధ్యానములు విడిచి పెట్టవద్దు. ఈశ్వరుని పాదాలను విడిచిపెట్టవద్దు. భక్తి లేని మాటలు, భక్తి లేని పనులు రోడ్డు మీద ఉన్న దుమ్ముతో సమానము. అందుచేత భక్తిని కాపాడుకోండి, భక్తిని పోషించుకోండి అని గాంధీగారు తరచుగా చెపుతూ ఉండేవారు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | |
|---|---|
| 07-02-07 బుధ | సఖినేటిపల్లి, గీతామందిరం |
| 12-02-07 సోమ | కాపవరం |
| 16-02-07 శుక్ర | చించినాడ శివరాత్రి |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# దృశ్యాన్ని నివారిస్తే - సత్య దర్శనమౌతుంది

ఇంద్రియ గోచరమైన ఈ ప్రపంచాన్ని నిజమని ఒక్క క్షణం కూడా భ్రమించకూడదు. భ్రమిస్తే అహంకారాన్ని బలపర్చుకొన్నట్లే. అలాగని దానిని నిరశించకూడదు, నిరాశక్తిగా, సాక్షిగా దృశ్యాన్ని చూస్తున్నా వివేకవంతంగా, విచక్షణా జ్ఞానంతో అర్థం చేసుకోవాలి. దృశ్యాన్ని చూడకుండా ఉండటం సాధ్యంకాదు కాని భగవంతుణ్ణి కలిపి చూస్తే ఏ భ్రమా, ఏ వికారం కలుగదు. వివేకం వికసించిన ఫలితంగా అది వైరాగ్యంగా మారిపోతుంది. ఏది నిత్యమో? ఏది అనిత్యమో గుర్తించగలిగినప్పుడు అనిత్యమైన శరీర మాయా దృశ్యాల మీద సహజంగా మోహం తగ్గుతుంది. మార్పు చెందేది నశించే పంచ భూత నిర్మితమైన వస్తుజాలాలను జ్ఞానులు గుర్తించరు. పరిణామ రహితమైనది, శాశ్వత సుఖ ప్రదమైన సత్యం మాత్రమే వారి దృష్టిపదంలో ఉంటుంది. విష వలయంలా ఉండి విషయాల గురించి మనం భయపడవలసిన పనిలేదు. కష్టపడవలసిన పని అంతకన్నా లేదు, గురు రూపాన్ని, నామాన్ని బోధను ఆశ్రయించితే చాలు. శ్రీ నాన్నగారు "ఇంద్రియ నిగ్రహం ఉన్న వానికే, మనో నిగ్రహం సాధ్య. అది ఉన్న వానికే చిత్తశుద్ధి లభిస్తుంది. అట్టివాడు మాత్రమే ఆత్మను దర్శించగలడు" అన్నారు. నిల్వ ఉన్న నీటి తటాకంలో నాచు కప్పి పచ్చని మైదానంలా కనిపిస్తుంది. అందు సూర్య బింబము కనబడాలంటే నాచును తొలగిస్తే చాలు. అలాగే వివిధ నామ రూపాలతో కూడిన ప్రపంచం అంతా నాచు వంటిదే. ఎన్నో వేల జన్మల నుంచి సంస్కారాలు అనే నాచును మన హృదయమనే తటాకంలో ఉంచుకొన్నాము. దాన్ని వివేకంతో తొలగించుకోవాలి. తల్లిపాల నుండి వేరు పడ్డ చిన్న పిల్లవాడు అలవాటు ప్రకారం తన బొటనవ్రేలును నోటిలో పెట్టుకొని చీకుతూ ఆనందిస్తాడు. పెద్దలు దాని వల్ల ప్రయోజనం లేదని వేలును తీస్తే ఏడుస్తాడు. నిజానికి తల్లి స్థానం నుండి అమృత ధారల వల్లనే శక్తి కలుగుతుంది. కొందరు నేత్రానందమే నిజమని ప్రకృతి దృశ్యాలను చూస్తారు. నిజమైన ఆనందం సత్యదర్శనం వల్లనే లభిస్తుంది. అది గురు కృప వల్లనే సాధ్యం.

- **సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్థవరం

# ఆత్మానుభవానికి గురువు అనుగ్రహమే ముఖ్యం

ఆత్మానుభవానికి శ్రుతి వాక్యాలు. మహనీయులైన జ్ఞానుల బోధలూ కూడా రెండో పక్షమేనంటున్నారు భగవాన్. అసలైనది, ముఖ్యమైనది గురువు అనుగ్రహమే అంటారు మహర్షి. అయితే మరి ఆ గురువు అనుగ్రహము ఎంతకాలానికి కలుగుతుందో అనే సందేహం గాని, త్వరగా కలగాలనే ఆశగాని... అవి ఆత్మానుభవానికి అంతరాయం కలిగిస్తాయని, మూడవస్థల్లోనూ సాక్షిగా స్వరూపంగా ఉండే ..... అదే నీవుగా, అదిగా ఉండిపో చాలు.... ఇక నీ సందేహాలన్ని సమసిపోయి స్వరూపంగా ఉండిపోతావంటారు.

వినయం అనేది ఆత్మజ్ఞానానికి మొదటి మెట్టు. తలవంచుకొని.... పతనం కాకుండా నిన్ను నీవు రక్షించుకో. అహంకారం, గర్వం వదిలించుకోకపోతే అవే పెద్ద ఆటంకాలవుతాయి ఆత్మానుభవానికి. ప్రేమతో, త్యాగంతో చేసే కర్మలు అనంతమైన ఆనందాన్నిస్తాయని గురువు బోధిస్తాడు.

నిస్వార్థపరులైన గురువులు తమ శిష్యులను లోపాలు లేని వారిగా తీర్చిదిద్దాలనుకుంటారు. అందుకే వారిని సానబెట్టటానికి, వారి బుద్ధికి మరింత పదును పెట్టటానికి అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటాడు.

శిష్యుడు కొద్దిపాటి జ్ఞానాన్ని పొందగానే, శాస్త్రాలను అధ్యయనం చేయగానే తానింక నేర్చుకోవలసింది ఏమీ లేదని, తాను పరిపూర్ణుడు అయ్యానని, తనంతటి గొప్పవారు, జ్ఞాని, పండితుడు వేరొకరు లేరని అహంకరిస్తాడు. దానికి కారణమేమిటంటే గురువుగారు తన శిష్యుడు అప్పటిదాకా నేర్చుకున్నదానికి మరింత మెరుగుపెట్టేందుకోసం వాడి చేత కొత్తగా అప్పడే వచ్చిన వారికి పాఠాలు చెప్పించడం. అంతమాత్రానికే తానెంతో ఎదిగిపోయానని, అంతా గ్రహించేసానని భావిస్తాడు శిష్యుడు. వాడిలో కదులుతున్న అహంకారపు ఛాయలు గుర్తించిన గురువు "నాయనా! నీవింకా పసివాడివే, నీవు నాలుగు విషయాలపైన అధికారం సంపాదించాలి. అవి పొందిన అనుభవజ్ఞులైన మహాత్ములను సందర్శించు. వారి వద్ద వినయంగా ఉండు. వారితో వితండవాదనలు చేయకు. అంతా నాకు తెల్సు అన్నట్లుగా ప్రవర్తించకు. వారు చెప్పేది జాగ్రత్తగా విని అర్థం చేసుకో. వారి అనుభవంతో నీ బుద్ధిలోని లోపాలను సవరించి నిన్ను సంస్కరిస్తారు" అని చెప్పి మహిమాన్వితులైన జ్ఞానుల వద్దకు పంపుతారు. వ్యాస భగవానుడు కూడా తన పుత్రుడు శుకుని జనకమహారాజు వద్దకు అలాగే పంపారు. అప్పుడు మహాత్ములు "కోపము, వ్యామోహము, కోరిక, గర్వం" అనే ఆ నాలుగు దుర్గుణాలను తొలగించి వాడిని పరిపూర్ణుడిని గావిస్తారు.

నిజమైన జ్ఞానం విషయం తెల్సుకోవటంలో లేదు. అది అనుభవంలోనికి తెచ్చుకోవడంలోనే అంతా ఉందని అప్పుడు గ్రహిస్తాడు శిష్యుడు.

**- బొప్పన అరుణాదేవి**